


సమగ్రంగా సిద్ధం

- నివేదికలు రూపొందించిన కలెక్టర్లు
- నేటి సదస్సుకు ప్రాధాన్యాల కనుగుణంగా కసరత్తు
- సీఎం చంద్రబాబుతో తొలి సమావేశానికి కలెక్టర్లు, ఎస్పీలు
- జిల్లాలోని పరిస్థితులపై కలెక్టర్లు, ఎస్పీలు పవర్ పాయింట్ ప్రజంటేషన్

గుంటూరు, బాపట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న పరిస్థితులు.. అవసరాలు.. ప్రభుత్వ పరంగా తీసు కోవాల్సిన చర్యలు.. జిల్లా అవసరాలు.. అభివృద్ధి.. సమస్యలు తదితరాలపై కలెక్టర్లు సమగ్రంగా నివేదికలతో సోమవారం జరిగే కలెక్టర్ల సదస్సుకు సిద్ధమయ్యారు. ఇక శాంతిభద్రత లు.. గంజాయి.. తదితరాలపై కసరత్తు చేసిన ఎస్పీలు ముఖ్యమంత్రి సమావేశానికి హాజరు కానున్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రప్రథమంగా కలెక్టర్ల సదస్సు సోమవారం రాష్ట్ర సచివాయలంలో జరగనుంది. దీనికి సంబందించి ఇప్పటికే కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చింది. దీంతో సమావేశంలో చర్చించబోయే వివిధ శాఖలకు సంబందించిన కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమాచారాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారుల నుంచి తెప్పించుకున్నారు. ఏయే రంగాలు ఐదేళ్లలో పూర్తిగా పడకేశాయి.. వేటిపై తక్షణమే దృష్టిసారించాలి.. నిధుల లభ్యత.. ఆయా విభాగాల ప్రస్తుత పరిస్థితులపై కసరత్తు చేసి కలెక్టర్లు నివేదికలను తయారు చేశారు. కలెక్టర్ల సదస్సుకు సన్నాహకంగా జిల్లా స్థాయి అధికారులతో సమావేశాలు కూడా ఇప్పటికే నిర్వ హించారు. ఆయా శాఖల అధికారుల నుంచి పూర్తి సమాచా రాన్ని తీసుకుని సమగ్రమైన నివేదికను రూపొందించు కున్నారు. ఈ సదస్సుకు సీఎం చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీసీఎల్‌ఏ, రెవెన్యూ, ఆర్థిక శాఖ మంత్రులు అనగాని సత్యప్ర సాద్, పయ్యా వుల కేశవ్ హాజరుకానున్నారు. సమావేశంలోనే కలెక్టర్లకు లక్ష్యాలను కూడా నిర్దేశించనున్నట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కలెక్టర్ల సదస్సులు మొక్కుబడిగా జరిగేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలెక్టర్ల సదస్సులకు శ్రీకారం చుట్టింది సీఎం చంద్రబాబు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంలో తొలి కలెక్టర్ల సదస్సుకు జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, బాపట్ల కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కే శ్రీనివాసరావులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లతో హాజరు కానున్నారు. సీఎంతో సమావేశం ఖరారు కాగానే ఆయా శాఖల పరిస్థితిపై అధికారులతో బాపట్ల కలెక్టర్ వెంకటమురళి మూడు రోజులపాటు వరుసగా సమావేశమయ్యారు. గృహనిర్మాణశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖల పై సమగ్ర వివరాలు తెప్పించుకున్నారు. ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలతో పాటు ఆయా శాఖల ఆర్థిక పరిస్థితిపై ఆరా తీశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితితో పాటు గంజాయి నియంత్ర ణకు గతంలో తీసుకున్న చర్యలతో పాటు భవిష్యత్తులో చేపట్ట బోయే యాక్షన్ ప్లాన్‌పై ఎస్పీ పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యారు. జిల్లాలో ఉన్న సహజ వనరులు, ఉద్యోగ, ఉపాధి రంగాలకు ఉన్న అవకాశాలు, పరిశ్రమలు, నిర్మాణ రంగంలోకి పెట్టుబడులు తదితర అంశాలపై కలెక్టర్ నాగలక్ష్మి ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్న తీరు, కొత్తగా తవ్వకాలకు గుర్తించిన ప్రదేశాలను కూడా వివరించనున్నారు. వివిధ శాఖల అధికారులతో రెండు రోజుల నుంచి సమావేశాలు నిర్వహిస్తూ సమగ్ర సమాచారాన్ని తెప్పించుకున్నారు. వాటిని పీపీటీ రూపంలో సదస్సులో నివేదించనున్నారు. బాపట్ల, రేపల్లెలో తాగునీటి సమస్య తీర్చడం అనేది ప్రాథమ్యాల జాబితాలో కలెక్టర్ చేర్చి నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి అద నపు స్టోరేజీ ట్యాంకుల అవసరంపై నివేదికలు తయారు చేశారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా జిల్లాలో ఖజానాపై ఎంత భారం పడనుందనేది కూడా వివరించనున్నారు. బాపట్ల లో నిలిచిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పట్టా లెక్కించడంపై కూడా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. చీరాలలో హ్యాండ్ లూమ్ పార్కు, ఆక్వాపార్కు నిర్మాణం తదిత రాలపై నేటి సదస్సులో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

సదస్సు ఇలా..

జిల్లాలను ప్రగతిపథంలో నిలబెట్టే కీలక భూమికని పోషించే కలెక్టర్లకు ప్రభుత్వ ప్రాధాన్యాంశాలను తెలియజేసి వాటి అమలుకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేయనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు సీసీఎల్‌ఏ జయలక్ష్మి ప్రారంభోపన్యాసం చేస్తారు. ఆ తర్వాత చీఫ్ సెక్రెటరి, రెవెన్యూ,ఆర్థిక, ఉపముఖ్య మంత్రులు ప్రసంగిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు సీఎం చంద్రబాబు కీలకోపన్యాసం చేస్తారు. ఆ తర్వాత 11 నుంచి 12 గంటల మధ్యన ప్రాథమిక రంగాలైన వ్యవసాయం, పశుసంవర్ధకం, మత్స్య, అటవీ, ఉద్యాన శాఖలపై సమీక్ష నిర్వహిస్తారు. 12.10 నుంచి 1 గంట వరకు సంక్షేమ శాఖల కార్యకలాపాలపై సమీక్షిస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం ఆరోగ్య, సీజనల్ పరిస్థితులపై చర్చిస్తారు. ఆ తర్వాత ప్రాథమిక, సెకండరీ, హయ్యర్ ఎడ్యుకేషన్‌పై సమీక్ష ఉంటుంది. అనంతరం మున్సిపల్ పరిపాలన, సీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (ఎంఎన్‌ఆర్‌ఈజీఏ, సెర్ప్, ఆర్‌డబ్ల్యూఎస్), హౌసింగ్, జలవనరులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు. విద్యుత్‌చ్ఛక్తి, రెవెన్యూ(భూములు, రిజిస్ట్రేషన్, స్టాంపులు, ఎక్సైజ్) శాఖలపై సమీక్షిస్తారు. సమావేశం ఆఖరులో గంటన్నర పాటు శాంతిభద్రతల అంశంపై ఎస్పీలతో సమీక్షిస్తారు. ఈ సమావేశానికి డీజీపీ కూడా హాజరుకానున్నారు. సాయంత్రం 6.30 గంటలకు స్పెషల్ చీఫ్ సెక్రెటరి ముగింపు ప్రసంగంతో కలెక్టర్ల సదస్సు ముగుస్తుంది.



కొత్త పింఛన్లు ఎప్పుడో..?

- ఏళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- దరఖాస్తు ప్రక్రియను కష్టతరం చేసిన వైసీపీ
- గత టీడీపీ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు ఎంపిక

గుంటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు నమోదు చేయించుకునే అవకాశం ఉండేది.. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇదే పెద్ద ప్రహసనంలా మారింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే నమోదుకు అవకాశం దక్కేది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో తమకు అవకాశం ఎప్పటికి దక్కుతుందో.. ఎప్పటి నుంచి పింఛన్ల లబ్ధి పొందుతామని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎదురు చూస్తోన్నారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశంపై కొండంత ఆశతో లబ్ధిదారులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశంలేక పింఛనుకు దూరమైన అనేక మంది కూటమి ప్రభుత్వం రాకతో తమకు అవకాశం వస్తుందన్న ఆశతో రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. దానికి తోడు పింఛను మొత్తాన్ని కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచేసింది. మరోవైపు వైసీపీ హయాంలో నిబంధనల వడపోతతో అనర్హత బారినపడి పింఛన్లు కోల్పోయిన వేలాది మంది అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. వెరసి పింఛన్ల కోసం ఎదురు చూసేవారి సంఖ్య భారీగా పెరిగింది.

నిరంతర ప్రక్రియగా నాడు నమోదు

2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైన పింఛను కోసం దరఖాస్తు చేసుకునే వీలుండేది. వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం ఉండేది. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానం తెచ్చింది. ప్రతి ఏడాది జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది. అయితే గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆ ప్రకారం జాబితాలను రూపొందించిన దాఖలాలు లేవు. గతంలో టీడీపీ ప్రభుత్వం కొత్త పింఛన్ల నమోదును నిరంతర ప్రక్రియగా చేస్తే వైసీపీ ప్రభుత్వం తొలగింపులను నిరంతర ప్రక్రియగా చేసుకుంది. విద్యుత్, ఇన్‌కమ్ టాక్స్, నాలుగు చక్రాల వాహనం, ఇళ్ల స్థలం, పొలం తదితరాల పేరుతో వేలాదిమందిని పింఛను పథకానికి అనర్హులను చేసి తొలగించారు. పొరపాటున తిరస్కరణకు గురైతే మరో ఆరు నెలలు ఆగాల్సి వచ్చేది. ఇలా అర్హులైన లబ్ధిదారులు వేలాది మంది ఏళ్లకు ఏళ్ల పింఛను కోల్పోయిన పరిస్థితి ఉంది. ఇలాంటి వారంతా కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు.

నిర్ణయంపై ఎదురు చూపులు

కొత్త పింఛన్లపై కూటమి ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ కోసం పలువురు ఎదురు చూస్తున్నారు. అనేక మంది ఒక చోట నుంచి వేరొక చోటికి మారినవారు ఉన్నారు. వారు కూడా పింఛనును తాము ప్రస్తుతం నివాసం ఉండే చోటికి బదిలీ చేసుకోవాలని చూస్తున్నారు. వీటిపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.



రుణాలు అనుమానాలు

- లోపభూయిష్టంగా జీడీసీసీ విధానం
- మిస్టరీగా మారిన రూ.53 కోట్ల రుణం మంజూరు



అక్రమంగా తీసుకున్న రుణాలతో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు

గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రుణాల విషయంలో జీడీసీసీ బ్యాంకు అవలంభిస్తున్న విధానంపై అనుమానాలు నెలకొంటున్నాయి. ప్రధానంగా శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన మిర్చికి రుణం ఇచ్చే విషయంలో జాతీయ, ప్రైవేటు బ్యాంకులు పకడ్బందీగా వ్యవహరిస్తుండగా జీడీసీసీ తీరు లోపభూయిష్టంగా ఉన్నాయన్న విమర్శలున్నాయి. పర్సనల్ సెక్యూరిటీలు, ఆధార్‌ని సిబిల్ అకౌంట్‌కి లింకులను పట్టించుకోకుండా కేవలం కోల్డ్‌స్టోరేజ్ యజమాని ఇచ్చే బాండ్, పట్టాదారు పాసు పుస్తకం ఆధారంగా ఇబ్బడిముబ్బడిగా రుణాలు ఇస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు ఎవరెవరి పేర్లతోనో జీడీసీసీ బ్యాంకులో రుణాలు తీసుకుని వ్యాపారాలు చేసుకుంటు న్నాయి. తాజాగా జీడీసీసీ బ్యాంకులో వెలుగు చూసిన విశ్వసాయి కోల్డ్‌స్టోరేజ్ ఉదంతం కూడా ఇంచు మించు ఇలాంటిదే. గత ఏడాది, ఈ సంవత్సరం మిర్చి సీజన్ మందకొడిగా సాగింది. రైతులు ఆశిం చిన ధర మార్కెట్‌లో లభించలేదు. దాంతో రైతులు, కొంతమంది వ్యాపారులు దాదాపుగా 70 లక్షల మిర్చి టిక్కీలను కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేశారు. మిర్చి మార్కెట్ ఊపందుకోకపోతుండటంతో కొంతమంది బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నారు. జాతీయ, ప్రైవేటు బ్యాంకులు అయితే రుణం ఇచ్చేముందు విచారణ అధికారులతో అన్ని వివరాలు సేకరిస్తాయి. కోల్డ్‌స్టోరేజ్ వద్దకు రైతు తప్పనిసరిగా రావాలి. అలానే నిల్వ చేసిన స్టాకు, వెరైటీ, నాణ్యతని పరిశీలిస్తారు. పట్టాదారు పాసుపుస్తకం, కోల్డ్‌ స్టోరేజ్ యాజమాన్యం జారీ చేసిన బాండ్ పేపర్‌ని తీసుకుని రైతుతో వేలిముద్ర వేయిస్తారు. అలానే పర్సనల్ సెక్యూ రిటీ కింద స్థిరాస్తిని కూడా తనఖా పెట్టుకుంటారు. సిబిల్ అకౌంట్‌తో ఆధార్‌ని లింక్ చేయడం వల్ల సంబంధిత రైతు/వ్యాపారి మరో బ్యాంకు నుంచి రుణం తీసుకునే అవకాశం ఉండదు. ఈ విధంగా ఎంతో పకడ్బందీగా వ్యవహరిస్తారు. అయితే జీడీసీసీ బ్యాంకు విషయానికి వచ్చేసరికి చైర్మన్ ఏది చెబితే అది ఆ బ్యాంకు శాఖల అధికారులు పాటిస్తారు.

నకిలీలతో రుణాలు.. మరుగున పరిచే యత్నాలు

జీడీసీసీ బ్యాంకు నల్లపాడు బ్రాంచ్‌లో వెలుగు చూసిన కుంభకోణం మరుగునపరిచే ప్రయత్నాలు పెద్దఎత్తున జరుగుతున్నట్లు ఆరోపణలు న్నాయి. ఒక కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసిన సరుకుకు రూ.53 కోట్ల రుణం ఎలా ఇచ్చారనేది మిస్టరీగా మారింది. దాదాపుగా 150 మంది రైతుల పేర్లతో ఈ రుణాలు తీసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమౌతోన్నాయి. ఈ క్రమంలో కొందరి ఆధార్‌లు, పట్టాదారు పాసుపుస్తకాలు నకిలీవి సృష్టించి బ్యాంకు నుంచి రుణం పొందారు. అసలు పొలం లేని వ్యక్తుల పేర్లతో రుణం మంజూరైందంటే నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు కూడా సృష్టించి ఉంటారని తెలుస్తోంది. పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నేతలు కూడా రుణాలు పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఇప్పటికే మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదు చేయగా వారు విచారణకు ఆదేశించారు. కాగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణంతో తాడికొండ, అమరావతి రాజధాని పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో పెట్టుబడులు పెట్టినట్లు భోక్తలపై ఆరోపణలు వస్తున్నాయి. వట్టిచెరుకూరుకు చెందిన సుధాకర్ అనే వ్యక్తి ఆందోళనతో ఆయన పేరు మీద తీసుకున్న రుణం రూ.10 లక్షలు తిరిగి చెల్లించేశారు. అంతమాత్రాన జరిగిన నేరాన్ని కప్పి పెడతారా అని టీడీపీ శ్రేణలు బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై విజిలెన్స్, సహకార శాఖ అధికారులు విచారణలు జరిపితే అసలు సూత్రధారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నాయి.



- నిండుకుండలా నాగార్జున సాగర్ జలాశయం

సాగర్ నీటి విడుదల నేడే



576 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

- 576 అడుగులు దాటిన జలాశయ నీటి మట్టం ఉదయం 8 గంటలకు గేట్లు తెరిచేందుకు ఏర్పాట్లు
- నదీ తీరంలో ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి), మాచర్ల రూరల్, రెంటచింతల, ఆగస్టు 4: ఉరకలెత్తుతూ ప్రవహిస్తోన్న కృష్ణమ్మ.. నాగార్జున సాగర్ జలాశయానికి చేరుతోంది. సాగర్ జలాశయం నిండు కుండలా మారింది. వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతుండటంతో సోమ వారం ఉదయం 8 గంటలకు సాగర్ క్రస్ట్ గేట్లు తెరవనున్నారు. ఇందుకోసం జలవనరు ల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. నల్గొండ జిల్లాకు చెందిన అధికారులు క్రస్టుగేట్లను తెరవనున్నారు. సాగర్ నుంచి దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద పెరిగితే ఆయా ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, రెవెన్యూ, పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల, తుంగభద్ర జలాశయాల నుంచి 4,87,451 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటి మట్టం గరిష్ఠ స్థాయి కొనసాగుతుండడంతో అదనంగా వస్తున్న నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయానికి 4,27,711 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగుల కాగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు 576.10 అడుగులకు చేరింది. 312.50 టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 271.90 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్ కుడి కాల్వకు 5700 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 4613, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 26,040 క్యూసెక్కుల నీటిని సాగర్ నుంచి విడుదల చేస్తున్నారు. డ్యాంనుంచి దిగువకు 37873 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా 3,22,817 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. ఇదే స్థాయిలో ప్రవాహం రానున్న వారం రోజులు కొనసాగే అవకాశాలు ఉన్నట్లు జలవనరులశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పులిచింతలకు 25,339 క్యూసెక్కులు విడుదల

సత్రశాల వద్ద కృష్ణానది పై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న పులిచింతలకు ఆదివారం 25,339 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ వెంకటరమణ చెప్పారు. 4 క్రస్ట్ గేట్లను 1 మీటర్ మేర ఎత్తి 17,048 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8291 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0469 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.05 మీటర్లు అంటే 6.7640 టీఎంసీల నీరుందన్నారు. సోమవారం సాగర్ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు విడుదల కానున్నట్లు ఎస్ఈ తెలిపారు.



టేల్‌రేస్ ఛానల్ ద్వారా విడుదలవుతున్న నీరు

చేపల చోరీ

- నిడుబ్రోలు చెరువులో అర్ధరాత్రి వేట
- చెరువుపై కొరవడిన మత్స్యశాఖాధికారుల నిఘా

పొన్నూరుటౌన్, ఆగస్టు 4: పేరుకే అది మత్స్యశాఖ చెరువు.. అక్కడ చేప పిల్లల్ని పెంచి ఎగుమతి చేయాలి. అయితే మత్స్య శాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణాలోపంతో చేపల దొంగతనం యథేచ్ఛగా సాగుతోంది. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంతో పాటు చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నిడుబ్రోలులో ఉంది. నిడుబ్రోలు చౌడేశ్వర దేవాలయానికి చెందిన 27 ఎకరాల చెరువును 99 ఏళ్ల లీజ్‌కు మత్స్యశాఖ తీసుకుని ఏటా 2 కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసి విక్రయిస్తారు. అంతేగాకుండా బ్రీడింగ్ చేపలను పెంచుతూ మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వానికి ఆదాయం చూపుతున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడున్న మత్స్య శాఖ కార్యాలయాన్ని బాపట్ల జిల్లా కర్లపాలేనికి తరలించింది. అప్పటి నుంచి ఈ చేపల చెరువులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. ప్రస్తుతం చెరువులోని బ్రీడింగ్ చేపలు ఐదు నుంచి పది కేజీల పైబడి బరువు తూగుతున్నాయి. బ్రీడింగ్ చేపలను అధికారులు గతంలో జాగ్రత్తగా కాపాడేవారు. అయితే ప్రస్తుతం ఉత్పత్తి లేకపోవడంతో వాటి గురించి పట్టించుకునే వారే లేరు. దీంతో ఈ చేపలపై అక్రమార్కుల కన్నేశారు. అర్ధరాత్రి వేళ చేపలను పట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో చేప పది కిలోల వరకు బరువు తూగుతుండటంతో అక్రమార్కులకు చేపల వేట కాసుల వేటగా మారింది.



నిడుబ్రోలు మత్స్యశాఖ ఆధీనంలోని చేపల చెరువు

అడవిలో ఉన్నట్లుగా ఉంది

- రాత్రిళ్లు లైట్లు కూడా వెలగవు..
- నిర్మాణాల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- గంజాయి మత్తుతో యువత హల్‌చల్
- పోలీసులు ఈ వైపు చూసింది లేదు..
- మంత్రి మనోహర్ వద్ద జగనన్న కాలనీ లబ్ధిదారుల ఆవేదన

6లో..



కాలనీలో నీరునిలిచి ఉండగా నిర్మాణాలు జరుగుతున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్

అడవిలో ఉన్నట్లుగా ఉంది

- రాత్రిళ్లు లైట్లు కూడా వెలగవు..
- నిర్మాణాల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- గంజాయి మత్తుతో యువత హల్‌చల్
- పోలీసులు ఈ వైపు చూసింది లేదు..
- మంత్రి మనోహర్ వద్ద జగనన్న కాలనీ లబ్ధిదారుల ఆవేదన


తెనాలి: నిర్మాణపనులపై అధికారులను ప్రశ్నిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, ఆగస్టు 4: మంచినీటి పైపులైన్లు లేవు.. మురుగుపారుదలకు డ్రైన్లులేవు.. నడిచేందుకు రోడ్లులేవు.. వీధిదీపాలు వెలగవు అసలు కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ఎవరైనా అత్యసర వైద్యసాయం అవసరమైతే ఆస్పత్రికి వెళ్లేందుకు సౌకర్యం కూడా లేదు. వర్షం కురిస్తే జలమయంగా మారి పాములు సంచరిస్తూ ఉంటాయి.. మేం అసలు కాలనీలో ఉంటున్నామో అడవిలో ఉంటున్నామో తెలియని పరిస్థితుల్లో బతుకుతున్నామని మంత్రి నాదెండ్లమనోహర్ ఎదుట జగనన్న కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని పెదరావూరులో జగన్నకాలనీని మంత్రి మనోహర్ క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడ నిర్మాణ గృహాలను, స్థలాలను, పరిశీలించి లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మనోహర్‌కు పలు సమస్యలను వివరించారు. కాలనీలో కేవలం స్థలాలు ఇచ్చారే తప్ప అక్కడ నివాసయోగ్యానికి అవసరమైన సౌకర్యాలు కల్పించలేదన్నారు.

ఇళ్లు కట్టుకోలేని వారికి కాంట్రాక్టర్ల ద్వారా వాటిని కట్టిస్తామని చెప్పి నాణ్యతాప్రమాణాలు లేని ఇల్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. నగదు కూడా తమ ఖాతాలనుండి నేరుగా వారే డ్రా చేసుకుంటున్నారని ఫలితంగా ఇవేం కట్టుబడి అని ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో కనీసం ఇంటికి మంచి నీటి కనెక్షన్లు కూడా లేకపోగా రోడ్లు కూడా లేవని అన్నారు. స్థలాలు ఇచ్చారే తప్ప ఇక్కడ ప్రజలు ఎలా నివసిస్తున్నారో పట్టించుకునే అధికారులు కూడా లేరంటు విమర్శించారు. ఇక్కడ నివసించాలంటే భయంగా ఉంటుందని రాత్రులు ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే తెనాలి చేరేందుకు కనీస సౌకర్యంకూడా లేదని వివరించారు.

- జగనన్న కాలనీలో పేదల భూముల పేరుతో వారికి కేటాయించిన స్థలాలు, ఇంటి నిర్మాణాల పేరుతో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారించి నివేదికను తనకు అందించాలని మంత్రి మనోహర్ అధికారులను ఆదేశించారు.
- గంజాయి, మద్యం తాగేందుకు జగనన్నకాలనీలు అడ్డాగా మారాయని స్థానికుల మంత్రికి తెలిపారు. పోలీసులు మాత్రం కాలనీవైపు కన్నెత్తి కూడా చూడటంలేదని ఈ ప్రాం తంలో వారి ఆగడాలతో భయాందోళనగా ఉందని వివరించా రు. దీంతో మనోహర్ పోలీసులను పిలిచి గత ప్రభుత్వం మాదిరి పనిచేస్తే సహించేది లేదన్నారు. పేదలుండే ప్రాంతంలో ఎందుకు పోలీసులను పర్యవేక్షించేలా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాలనీలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం : మంత్రి

కాలనీలో దుస్థితిని గమనించాను.. లబ్ధిదారుల సమస్యలను విన్నాను. రాబోయే రోజుల్లో ఆ సమస్యలన్నింటిని పరిష్కరించి మంచి కాలనీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కాలనీలో ప్రతి లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లానని రానున్న రోజుల్లో తప్పనిసరిగా ప్రతి లబ్ధిదారుడికి మంచి జరిగేలా బాధ్యత తీసుకుంటానని మనోహర్ హామీ ఇచ్చారు.

కొల్లిపర మండలంలో..

కొల్లిపర, ఆగస్టు 4: ఆదివారం మండల పరిధిలోని దావులూరులో ఇళ్ల స్థలాలను, గృహనిర్మాణాలను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. రోడ్లు, గృహనిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, వాటర్, విద్యుత్ సౌకర్యాలు సక్రమంగా లేక పోవటంతో గృహనిర్మాణాలు చేయలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, మౌలిక వ స తు లు


కొల్లిపర మండలం దావులూరు కాలనీలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

కల్పించాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంత రం జరిగిన అవగాహన సదస్సులో మనోహర్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం పేదప్రజలకు ఎల్లప్పుడు అండగా నిలుస్తోందన్నారు. దావులూరులో లేఔట్‌లో రూ.10 లక్షలతో రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ సిద్ధార్థ, హౌసింగ్ ఈఈ భాస్కరరావు, డీఈ రఫీ ఉల్లాఖాన్, ఏఈ సుబ్బారావు, ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.


తాడికొండ బీఎస్ఎన్ఎల్ 4జీ సిగ్నల్స్ టవర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

మార్చి నాటికి దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- తాడికొండలో 4జీ టవర్స్ పరిశీలించిన పెమ్మసాని

తాడికొండ, ఆగస్టు 4: దేశవ్యాప్తంగా వీలైనంత వేగంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను మార్చినాటికి అమలుచేయటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా తాడికొండలో బీఎస్ఎన్ఎల్ 4జీ సిగ్నల్ వ్యవస్థను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించి టెస్ట్ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన బేస్ బ్యాండ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఎక్కువ ధరలతో ఫోన్ రీచార్జ్‌లు చెల్లించి ఫోన్ సర్వీసులు ఉపయోగించుకోలేని పరిస్థితి ఉందన్నారు. రీచార్జ్ ధరలు పెరగటం వల్ల ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో బీఎస్ఎన్ఎల్‌ను 4జీ సేవలతో ఆధునీకరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని తెలిపారు. ప్రధాన మంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలలుగన్న విధంగా ప్రజలకు ఉన్నతమైన ఫోన్ సేవలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఏపీలో క్వాలిటీతో కూడిన 4జీ సేవలను అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అతితక్కువ ధరలకే ఇంటర్నెట్ సేవలను ప్రజలు అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతోనే కేంద్రం 4జీ టవర్లను సిద్ధం చేస్తుందన్నారు. బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జే.రవి మాట్లాడుతూ ఏపీలో 300 లొకేషన్లను రెడీ చేసుకొని టెస్టులు చేస్తున్నామని తెలిపారు. 400 సెంటర్లలో టవర్స్‌కు ఎక్విప్మెంట్‌ను ఇన్‌స్టాల్ చేసి 4జీ సేవలు అందించటానికి సిద్ధం అవుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఐటీ శిక్షణ

గుంటూరు(విద్య), ఆగస్టు 4: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులతో పూర్తిచేసిన వారికి ఐటీ శిక్షణ ఇవ్వనున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీన ఇందుకోసం ప్రభుత్వ ఐటీఐ కళాశాల(కలెక్టరేట్ ఎదుట) క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 2023-24 విద్యా సంవత్సరాల్లో 75శాతం మార్కులతో ఇంటర్ (బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ) పూర్తిచేసి ఉండాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్స్‌జిరాక్స్, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. హెచ్ఆర్ ఇంటర్వ్యూ, రాత పరీక్ష ద్వారా ఐటీ శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. ఇతర వివరాల కోసం మణిదీప్, సెల్ నం.80746 07278లో సంప్రదించాలని సూచించారు.

ఐటీఐ కళాశాలల్లో మూడో విడత సీట్ల భర్తీకి
దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), ఆగస్టు 4: జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో మూడో విడత సీట్ల భర్తీకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్, సహాయ సంచాలకులు సాయివరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 26లోగా నెట్ సెంటర్స్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పది మార్కుల జాబితా, కుల ధ్రువీకరణపత్రం, టీసీ, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, విద్యార్థి ఫొటోలు, మెయిల్ ఐడీ, ఫోన్‌నంబర్, రెసిడెన్సియల్ అడ్రసు తదితర వివరాలు iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

రెండు రోజుల్లో రాజధానిలో జంగిల్ క్లియరెన్స్ ప్రారంభం


వైసీపీ సర్కార్ ఐదేళ్ల పాలనలో అడవిలా మారిన హైకోర్టు పరిసర ప్రాంతాలు

- 26వేల ఎకరాలలో ముళ్ల కంప తొలగింపు

తుళ్లూరు, ఆగస్టు 4: రాజధాని అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు రెండు రోజుల్లో మొదలు కానున్నాయి. చంద్రబాబు సీఎం కాగానే అమరావతి పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పర్మినెంట్ ప్రభుత్వ అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ భవన నిర్మాణాల కొనసాగింపు చేయాలనే దానిమీద మద్రాసు ఐఐటీ బృందం పునాదులను పరిశీలించింది. అదేవిధంగా వందల సంఖ్యలో కట్టిన ఉద్యోగుల ఇళ్ల సముదాయాల టవర్లను హైదరాబాద్ ఐఐటీ బృందం పరిశీలించింది. ముందు జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తే ఎక్కడ నుండి అభివృద్ధి పనులు కొనసాగించాలనేది అర్థం అవుతుందని సీఆర్డీఏ అధికారులు చెపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధానిలో పర్యటించి ముందు జంగిల్ క్లియరెన్స్ పనులు చేయాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. గత నెల 11వ తేదీన జంగిల్ క్లియరెన్స్ పనులకు సీఆర్డీఏ టెండర్లు పిలిచింది. అదే నెల 29న రివర్స్ టెండరింగ్ కూడా పూర్తై ప్రముఖ ఎన్‌సీసీ కంపెనీ జంగిల్ క్లియరెన్స్ పనులు దక్కించుకుంది. సోమ, బుధవారాలలో పనులు ప్రారంభించే అవకాశం ఉంది. మొత్తం 26వేల ఎకరాలలో జంగిల్ క్లియరెన్స్ పూర్తిచేయాలని గడువు విధించారు. రాజధాని అమరావతిని ఐదేళ్లలో వైసీపీ సర్కార్ అడవిని చేసింది.

బొల్లా.. అసత్య ప్రచారాలు మానుకో...


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, ఆగస్టు 04: మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు హయాంలో ఘర్షణలు అదుపు చేసి ఉంటే రషీద్ మృతి చెందేవాడు కాదని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా నీచ రాజకీయాలు మానుకోవాలని, ఘర్షణలో బొల్లా హస్తం ఉన్నట్లు తేలితే కటకటాల్లో వేయిస్తామని హెచ్చరించారు. శవాలను చూడందే జగన్‌కు, అసత్య ప్రచారాలు చెయ్యనిదే బొల్లాకు నిద్ర పట్టడంలేదని జీవీ విమర్శించారు. గతంలో ఏనుగుపాలెంలో శ్రీదేవి అనే మహిళ మృతి చెందిన రోజు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి, ఇక్కడ ఎమ్మెల్యేగా బొల్లా ఉన్నారని, ఆనాడు ఎందుకు చర్యలు తీసుకోలేదని, ఎందుకు అరెస్టు చెయ్యలేదని నిలదీశారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఎవరు తప్పుచేసినా వదిలిపెట్టబోమన్నారు. ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా బొల్లాకు బుద్ధి రాలేదన్నారు. దుర్మార్గాలను ప్రోత్సహించడం, అమాయకులపై తప్పుడు కేసులు పెట్టడం కాదని, దోషులను శిక్షించాలన్నారు. గతంలో మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై బొల్లా అసెంబ్లీలో ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. మీరు చేసిన హత్యా రాజకీయాలకు వివేకానందరెడ్డి కుమార్తె మీపై నమ్మకంలేక పక్క రాష్ట్రానికి వెళ్లి సీబీఐ విచారణ కోరిందని తెలిపారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. కాలవలకు నీళ్లు వచ్చాయని, గుండ్లకమ్మకు సాగర్ జలాలు ప్రవహిస్తున్నాయని, రాష్ట్రంలో జలకళ మొదలైందన్నారు. నీ విషపు చుక్కలు వెయ్యరాదని బొల్లాకు సూచించారు. మీ ప్రభుత్వ హయాంలో అన్నీ దొంగ సర్టిఫికెట్స్‌తో పింఛన్లు పంపిణీ చేశావని, ఇప్పటికే నియోజకవర్గంలో వందలకొద్దీ దొంగ పింఛన్లను ఆధారాలతో గుర్తించామని తెలిపారు. అవి ఎలా వచ్చాయో తెలపాలని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ నీకు రాజకీయాల్లో పరిపక్వత రావాలని బొల్లాకు సూచించారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన వెంటనే విమర్శలు చేయడం ఏమిటని, ఇది సభ్యత కాదని, సంస్కారం కాదని కొంత ఓపిక పట్టాలంటూ బొల్లాకు చురకలు వేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రొడ్డా వీరాంజనేయరెడ్డి, మురళీ కృష్ణయాదవ్, ఆయుబ్ ఖాన్, బీజేపీ నాయకులు మేడమ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష దాటిన జనసేన సభ్యత్వాలు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెల్లడి

గుంటూరు, ఆగస్టు 4: ఉమ్మడి గుంటూరు జిల్లాలో జనసేన పార్టీ సభ్యత్వాలు లక్ష దాటినట్లు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం పార్టీ 28వ డివిజన్ అధ్యక్షుడు మామిడి రామారావు ఆధ్వర్యంలో ఉదయం నల్లగుంట నీలంపాటి అమ్మవారి గుడి దగ్గర, మధ్యాహ్నం సీతమ్మకాలనీ ఐదో లైన్‌లో ఏర్పాటుచేసిన పార్టీ సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ రాష్ట్రంలో ఇప్పటికే జనసేన సభ్యత్వాలు పది లక్షలు దాటినట్లు తెలిపారు. జనసేన సభ్యత్వ నమోదుతో పాటు రూ.5లక్షల జీవితబీమా కవరేజ్ కూడా అందజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం ఈ రెండు శిబిరాల్లో కొత్తగా 500 మందికి పార్టీ సభ్యత్వం నమోదు చేశారు. కార్యక్రమాల్లో 30వ డివిజన్ జనసేన అధ్యక్షుడు దాసరి వెంకటేశ్వరరావు, శ్రీపతి భూషయ్య, రాంబాబు నాయక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు లక్ష దాటిన సందర్భంగా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నాయకులు వేడుకలు జరిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఐటీ విభాగం ఇన్‌చార్జ్ చిల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పార్టీ కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు పంచి అభినందనలు తెలిపారు.


సభ్యత్వ నమోదు శిబిరంలో గాదె వెంకటేశ్వరరావు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- జాస్తి వీరాంజనేయులు

సింహాచలం, ఆగస్టు 4: గత ఐదేళ్లుగా తిరోగమన దిశలో పయనించిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాత్రమే ఉందని, అందుకు తగిన శక్తియుక్తులు ఆయనకు ప్రసాదించాలని సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ప్రార్థించానని అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ అప్పన్నకు చంద్రబాబు పేరున పూజలు చేయించామన్నారు. గత వైసీపీ పాలనలో మూడు రాజధానుల పేరుతో అమరావతిని పూర్తిగా నాశనం చేశారని, కానీ చంద్రబాబు అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, ఆయన కృషికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

సివిల్స్‌పై దృష్టి సారించాలి

- ప్రవాసాంధ్రుడు, కేవైఎస్ఎస్ అధ్యక్షుడు పాపినేని గాంధీ
- విద్యార్థినులకు రూ.25లక్షల ఉపకార వేతనాల పంపిణీ


ఉపకార వేతనాలు పొందిన విద్యార్థినులతో దాతలు, పాలకవర్గ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 4: ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు తగ్గుతాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని సివిల్స్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం కావాలని విద్యార్థినులకు ప్రవాసాంధ్రుడు, కమ్మ యువ సేవ సమితి(కేవైఎస్ఎస్) అధ్యక్షుడు పాపినేని గాంధీ సూచించారు. ఆదివారం స్థానిక కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో పాపినేని గాంధీ ఆధ్వర్యంలో 200మంది పేద విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.12వేలు చొప్పున రూ.25లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. సభకు కమ్మజన సేవాసమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాపినేని గాంధీ మాట్లాడుతూ సమయం, ఆరోగ్యం తప్ప ఇతర విషయాల గురించి ఆలోచించవద్దని సూచించారు. సోషల్ మీడియా, సెల్‌ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాగే ప్రతి ఏడాది ఉపకార వేతనాలు అందజేస్తామని, నూతన భవన నిర్మాణానికి నిధులు సమకూర్చుతామని హామీ ఇచ్చారు. దాతలు మన్నె భద్రయ్య, వేల్పూరు మాజీ సర్పంచ్ శివమల్లేశ్వరరావు, గ్రంధసిరి పంచాయతీ అధ్యక్షుడు రావేళ్ల శ్రీధర్ మాట్లాడుతూ పాపినేని గాంధీని ఆదర్శంగా తీసుకుని తరువాత తరాలకు సాయం చేయా లని కోరారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ అమెరికాలో కష్టపడి సంపాదించిన నిధులను విద్యార్థుల విద్య కోసం అందజే యడం పట్ల పాపినేని గాంధీ, ఆయన మిత్రులను అభినందిం చారు. ఈ సందర్భంగా ఉపకార వేతనాల నిధికి కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు చెరో రూ.లక్ష అందజేశారు. అనంతరం దాతలను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యు లు వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్యచౌదరి, కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, ఘంటా పున్నారావు, ముద్దన రాజేష్, ఘైనేని సీతారామయ్య, సాంబ శివరావు పాల్గొన్నారు.


కోటప్పకొండ వద్ద ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


షేక్ నాయబ్ ఖాజా మృతదేహం

నరసరావుపేట రూరల్, ఆగస్టు 4: మండలంలోని చినతురకపాలెం గ్రామానికి చెందిన షేక్ నాయబ్ ఖాజ(17) ఆదివారం మధ్యాహ్నం కోటప్పకొండ వద్ద గల చిలకలూరిపేట మేజరు పక్కన ఉన్న వ్యవసాయబావిలో ఈతకు వెళ్లి మృతిచెందాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ రోశయ్య కథనం మేరకు.. చినతురకపాలెం గ్రామానికి చెందిన నాయబ్ ఖాజా, మరి కొంతమంది విద్యార్థులు ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో చిలకలూరిపేట మేజరు వద్ద గల వ్యవసాయబావిలో ఈతకు వెళ్ళారు. నాయబ్ ఖాజాకు ఈత రాకపోవడంతో బావిలో మునిగిపోయి ఊపిరాడక మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మాబు సుబాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతిచెందిన నాయబ్ ఖాజా యలమందల జడ్పీ హైస్కూలులో 9వ తరగతి చదువుతున్నాడు.

అవాస్తవ కథనాలు ప్రచురించడం సమంజసం కాదు

- రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ

భట్టిప్రోలు(కొల్లూరు), ఆగస్టు 4: అవాస్తవ కథనాలను ప్రచురించి ప్రజలకు తప్పుడు సమాచారం చేరేలా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శనివారం టీడీపీ, వైసీపీ పరస్పర నిందారోపణలు చేసుకుని రథం సెంటర్‌లో చర్చావేదిక ఏర్పాటు చేసుకోవడంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని నిలువరించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కాగా టీడీపీ నాయకులు పార్టీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రయత్నించగా బందోబస్తులో ఉన్న ఎస్ఐ సాయంత్రం 6 గంటల వరకు ఆ ప్రదేశానికి వెళ్లవద్దని సూచించారన్నారు. ఆ సమయంలో టీడీపీ నాయకుడి మొబైల్ కిందపడటంతో వారి కార్యకర్త ముందుకు వంగి సెల్‌ఫోన్ తీసి ఇచ్చాడని, వారిద్దరి మధ్య ఎస్ఐ ఉన్నాడన్నారు. ఆ సమయంలో తీసిన ఫొటోను వక్రీకరించి చూపుతూ ప్రముఖ పత్రిక ఎస్ఐ చొక్కా పట్టుకున్న టీడీపీ కార్యకర్త అనే అవాస్తవ కథనాన్ని ప్రచురించిందన్నారు. కొన్ని పత్రికలు దానిపై పోలీసుశాఖ నుండి వివరణ తీసుకుని వాస్తవ కథనాలు ప్రచురించాయన్నారు. వార్తను ప్రచురించే సమయంలో దానికి సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకుని ప్రచురించడం మంచిదన్నారు. సమావేశంలో చుండూరు సీఐ, భట్టిప్రోలు, నగరం ఎస్ఐలు పాల్గొన్నారు.

స్నేహితుల దినోత్సవం రోజు విప్పర్లలో విషాదం

- హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విప్పర్ల వాసుల మృతి


రోహిత్ బాల ప్రసన్న(ఫైల్)

రొంపిచర్ల, ఆగస్టు 4: మండలంలోని విప్పర్ల గ్రామానికి చెందిన కందుల రోహిత్(25), ఉడతల బాలప్రసన్న(22) హైదరాబాద్‌లో జరిగిన ద్విచక్రవాహన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. రోహిత్ మూడు సంవత్సరాల నుంచి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీన విప్పర్ల గ్రామానికి చెందిన ఉడతల బాలప్రసన్న(22) విప్పర్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్ళాడు. ఇరువురు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జిపై డివైడర్‌ను ఢీకొని మృతిచెందారు. సమాచారాన్ని విప్పర్ల గ్రామంలోని బంధువులకు స్థానికులు తెలియజేశారు. ఇరువురు బంధువులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలివెళ్ళారు. గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. రోహిత్ తండ్రి మృతిచెందగా తల్లి, సోదరుడు గ్రామంలో ఉంటున్నారు. బాలప్రసన్న తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ముగ్గురు సంతానం కాగా బాలప్రసన్న చివరివాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వగ్రామమైన విప్పర్లకు ఆదివారం తీసుకువచ్చారు. బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

లారీ, మోటారు సైకిల్ ఢీ

- ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు


జడా పెద్దబాజీ మృతదేహం

నరసరావుపేట రూరల్, ఆగస్టు 4: కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం కాకాని వద్ద లారీ, మోటారుసైకిల్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. నరసరావుపేట రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన జడా బాజి, మందలపాటి బుజ్జి ఇద్దరు మోటారుసైకిల్‌పై నరసరావుపేటకు వస్తుండగా నరసరావుపేట మండలం కాకాని వద్ద గుంటూరు నుంచి వినుకొండ వైపు వెళ్తున్న లారీ, మోటారుసైకిల్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో జడా బాజీ(22) అక్కడికక్కడే మృతి చెందాడు. మందలపాటి బుజ్జి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు బాజీ తల్లి జడా ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101, 109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఉపాధ్యాయుల సర్దుబాటు హేతుబద్ధంగా నిర్వహించాలి

గుంటూరు(విద్య), ఆగస్టు 4: విద్యార్థి నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్వహించాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్దుబాటు కార్యక్రమం 1:20 నిష్పత్తితో సర్దుబాటు నిర్వహించాలని కోరారు. జీవోనం 117 తక్షణం రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వం అనుసరించిన విద్యా వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో 60 మంది దాటితేనే మూడో ఉపాధ్యాయుడిని ఇస్తామని ప్రకటించడం తగదని పేర్కొన్నారు. గత ఏడాది జనవరిలో వేలాది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారని, ప్రాథమికోన్నత పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయుడిని ఇవ్వాలని కోరారు.

నూతన శాఖలను ఏర్పాటు చేసుకోవాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పాల్గొన్న సీపీఐ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 4: నగరంలో పార్టీ లేని వార్డులో కూడా ప్రజలతో మమేకమై కొత్తగా సీపీఐ శాఖలను ఏర్పాటు చేసుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం 33, 34 డివిజన్‌ల పరిధిలో అశోక్ నగర్ సీపీఐ శాఖ సమావేశం శాఖ పెద్ది శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల పక్షాన ఉండి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. డిసెంబరు 26తో సీపీఐ ఏర్పడి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా వాడవాడలా సీపీఐ శత వార్షికోత్సవాల వేడుకలను జయప్రదం చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు కోటా మాల్యాద్రి, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, ఆకిటి రామచంద్రుడు, నూతలపాటి చిన్నా పాల్గొన్నారు.

వయనాడ్ వరద బాధితుల సహాయనిధి సేకరణ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 4: కేరళ, వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానికుల వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రూ.31,711 విరాళాలు సేకరించారు. అనంతరం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ మానవత్వంతో తమ వంతుగా సాయం చేయాలని ప్రజలను కోరారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, ఎంఏ చిష్టి, బి.లక్ష్మణరావు, షేక్ ఖాశిం షహీద్, బి.సత్యనారాయణ, ఆది నికల్సన్, షేక్ ఖాశిం వలి, ఎ.కళ్యాణి, షేక్ సమీర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మినీ కవితల పోటీ విజేతలు

గుంటూరు, ఆగస్టు 4 : అమరావతి సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో ఫేస్ బుక్ గ్రూపులో డాక్టర్ రావి రంగారావు నిర్వహిస్తున్న వారం వారం కవితల పోటీల విజేతలను ఆదివారం ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ వారం మినీ కవితల పోటీకి ఇచ్చిన 'అందం' అంశంపై మొత్తం 44 మంది కవులు మినీ కవితలు పంపించారు. ఇందులో 12 మంది కవుల మినీ కవితలు ప్రశంసా పత్రాలు పొందినట్లు తెలిపారు. వురిమళ్ళ సునంద (అమెరికా), మేడిశెట్టి యోగేశ్వరరావు (అమెరికా), టి.ధనుంజయరెడ్డి (గుంటూరు), లీలాకృష్ణ (తెనాలి), ఎనికేపల్లి శివకుమార్ (నందిగామ), ఎస్.రవికుమార్ (గుంటూరు), పొత్తూరి రామకృష్ణ (విజయవాడ), ఆళ్ల నాగేశ్వరరావు (తెనాలి), సింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు), పాణిరావు యర్రగుంట్ల (గుంటూరు), డాక్టర్ డివిజి శంకరరావు (విజయనగరం), చిత్తలూరి (హైదరాబాద్) విజేతలకు అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు తెలిపారు.

అలరించిన ఘంటసాల భక్తి గాన నీరాజనం



గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 4: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం పీఎల్ఎన్ మూర్తి నిర్వహణలో నవ కళోదయ ఆర్ట్స్ గుంటూరు వారిచే ఘంటసాల భక్తి గాన నీరాజనం కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సంస్థ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ గాయకులు టి.సుధీర్, ఆర్‌పీఎల్ నరసింహారావు, అన్నపూర్ణ, నారాయణ, మోహన్, అశోక్, వెంకాయమ్మచే పలు ఘంటసాల గీతాలను శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమం అనంతరం కళాకారులకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 4012 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 4 : విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 4012 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 10.7 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 166 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 707 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 556 క్యూసెక్కుల నీరు, పశ్చిమ కాల్వకు 210 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 380 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 1179 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

టీఎన్‌యూఎస్ నూతన కార్యవర్గ ఎన్నిక

● అధ్యక్ష, కార్యదర్శులుగా పసల బాలస్వామి, పాలేటి జగదీష్



నూతన అధ్యక్ష, కార్యదర్శులు బాలస్వామి, జగదీష్ తదితరులు

గుంటూరు(విద్య), ఆగస్టు 4: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్), నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం వినోభానగర్‌లోని హిందూ ఎయిడెడ్ యూపీ స్కూల్లో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా మారదాప చంద్రశేఖరరావు, అధ్యక్షుడిగా పసల బాలస్వామి, ప్రధాన కార్యదర్శిగా పాలేటి జగదీష్, ఉపాధ్యక్షుడిగా లింగాల వీరయ్య, కోశాధికారిగా చిలక నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా కారసాని శ్రీనివాసరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా అంకం నిర్మలామేరీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు తల్లపనేని రామారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఏ మోహనరావు, ఎం రాంబాబు, రాష్ట్ర డిప్యూటీ అధ్యక్షుడు జీవీఆర్‌కే ఎస్ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవోనం 117, 84 రద్దు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలనే పలు తీర్మానాలు ఆమోదించారు.

వక్ఫ్ ఆస్తులపై సర్వే చేయాలి

● సీఎం చంద్రబాబుకి ఎస్ఎం షరీఫ్ వినతి

గుంటూరు, ఆగస్టు 4 : ముస్లిం మైనార్టీల మనోభావాలతో కూడిన వక్ఫ్ ఆస్తులపై సమగ్ర సర్వే నిర్వహించాలని మైనార్టీ ఆశయ సాధన సమితి అధ్యక్షుడు ఎస్ఎం షరీఫ్ సీఎం చంద్రబాబుకి విజ్ఞప్తి చేశారు. కేంద్రం వక్ఫ్ బోర్డుకు సంబంధించి సవరణలు క్యాబినెట్ ఆమోదం, త్వరలో పార్లమెంటులో బిల్లు కథనంపై జరిగిన చర్చలో షరీఫ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు ఇతర దేశాల కన్నా మన దేశంలోనే అధికమని, అదేవిధంగా మన దేశంలో మూడో అతిపెద్ద భూ యజమాని కూడా వక్ఫ్ బోర్డేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వక్ఫ్ సర్వేకి సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో కొన్ని దశాబ్దాల క్రితం 1960లో ఒకసారి, 2000లో మరోసారి మాత్రమే సర్వే నిర్వహించారని షరీఫ్ గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో భూకబ్జాలు, అక్రమణలకు సంబంధించి కోకొల్లలుగా అర్జీలు ప్రభుత్వం దృష్టికి వస్తున్న తరుణంలో మైనార్టీలు కూడా వక్ఫ్ ఆస్తుల విషయంలో ఆందోళనలో ఉన్నారని ఈ సందర్భంగా షరీఫ్ తెలిపారు. మైనార్టీల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపి వక్ఫ్ బోర్డుపై కూడా సమీక్ష నిర్వహించి సమగ్ర సర్వేపై ఆదేశాలు జారీ చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అలానే అందరి ఏకాభిప్రాయంతో మెరుగైన సంపదను అర్జించి ఆ ఫలాలను మైనార్టీల ఆర్థిక పరిపుష్టి కోసం ఉతమిచ్చేలా చంద్రబాబు చొరవ చూపాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా సర్వే నిర్వహించి వక్ఫ్ భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయి, ఎన్ని సంస్థలు ఉన్నాయన్న దానిపై అధికారికంగా గెజిట్‌లో ప్రకటించాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు జానీ బాషా, ఆసిఫ్, రెహమాన్, సందాని, ఆరిఫ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రక్షాళన ఎప్పటికో?

● జవహర్ విజ్ఞాన కేంద్రం, లాంగ్వేజ్ ల్యాబ్ నిర్వీర్యం

● గడపతొక్కని కార్పొరేట్ కంపెనీలు.. జాడలేని జాబ్‌మేళాలు

● ఎన్డీఏ ప్రభుత్వమైనా కళాశాలను గాడిలో పెడుతుందా?

గుంటూరు(విద్య), ఆగస్టు 4: ఒకప్పుడు అక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు ఇన్ఫోసిస్, ఐఎల్ఎం(ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజిమెంట్), టీసీఎస్ వంటి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించేవారు. స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా, నాక్ గుర్తింపు ఉన్న ఆ కళాశాల విద్యార్థినుల జీవితాలకు దిక్సూచిగా మారి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా కల్పించేవారు. అయితే గడిచిన ఐదేళ్లలో ఈ కళాశాల కీర్తిని ఇక్కడ నిర్వహకులు మసకబారేలా చేశారు. యూజీసీ నుంచి పుష్కలంగా నిధులు వస్తున్నా వాటిని సద్వినియోగం చేసుకునేలా కార్యచరణ మాత్రం లేకుండా పోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. డిగ్రీ పూర్తిచేసిన వారికి పట్టాలు చేతికిచ్చి పంపడం మినహా వారికి ఉద్యోగ, ఉపాధి కల్పించేదిశగా చర్యలు తీసుకున్న దాఖలు లేవు. ఇదీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రస్తుత దుస్థితి. కళాశాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తే తప్ప తిరిగి పూర్వవైభవం రాదని విద్యార్థినులు అంటున్నారు.



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల



ఉండీ ఉపయోగం లేని లాంగ్వేజ్ ల్యాబ్

జేకేసీ, లాంగ్వేజ్ ల్యాబ్‌లు నిర్వీర్యం..

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 1500 మందికిపైగా విద్యార్థినులు బీఎస్సీ, బీఏ, బీకాంతోపాటు కొన్ని పీజీ కోర్సులు అభ్యసిస్తున్నారు. డిగ్రీ విద్యార్థినులకు మూడో ఏడాది నుంచే ఉద్యోగ ఉపాధి అకాశాలకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ఉన్నత విద్యామండలి ప్రత్యేకంగా ఇక్కడ జవహర్ విజ్ఞాన కేంద్రం, లాంగ్వేజ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకు అప్పట్లోనే దాదాపు రూ.15లక్షలకు పైగా వెచ్చించారు. రెండు ల్యాబ్‌ల్లో దాదాపు 60పైగా అత్యాధునిక కంప్యూటర్స్‌తో పాటు ప్రత్యేకంగా శిక్షణ పొందిన మెంటార్స్ కోఆర్డినేటర్స్‌ను నియమించారు. కార్పొరేట్ కంపెనీలతో నిత్యం అనుసంధానమౌతూ వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి క్యాంపస్ ఇంటర్వ్యూల కోసం విద్యార్థుల్ని సన్నద్ధం చేసేవారు. అయితే గడిచిన నాలుగున్నర ఏళ్లలో ఇటువంటి కార్యకలాపాలు దాదాపు స్వస్తిచెప్పి శిక్షణను అటకెక్కించారు.

కార్యకర్తలే తెలుగుదేశం పార్టీ బలం

● ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నీతి నిజాయితీ స్వచ్ఛతకు ఎన్టీఆర్ నిలువెత్తు నిదర్శనమని, 40 ఏళ్ల ప్రయాణంలో టీడీపీ ఒడిదుడుకులను ఎదుర్కొని నిలిచిందంటే కార్యకర్తలు, నాయకులే కారణమని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని 39వ డివిజన్ మారుతీ నగర్‌లో టీడీపీ సీనియర్ కార్యకర్త సింగిశెట్టి వీరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం టీడీపీ పతాకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ కార్యకర్తల ను ఆదుకోవడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామన్నారు. స్థానికంగా రోడ్లు, డ్రైన్లు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, కమిషనర్‌తో మాట్లాడి అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని చెప్పారు. వైసీపీ కార్పొరేటర్లను కూడా కలుపుకుంటూ వెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహమ్మద్ నసీర్, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, మద్దిరాల మ్యాని, నిమ్మల శేషయ్య, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని

సహకారం సంఘంలో అక్రమాలపై నిగ్గు తేలేనా?

● నాదెండ్ల సహకార సంఘంలో వైసీపీ నేతల ఇష్టారాజ్యం

● యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

నాదెండ్ల, ఆగస్టు 4: వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో ఆ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘాల్లో నిబంధనలను ఉల్లంఘించి మా ఇష్టం, మా రాజ్యం అనే విధంగా వ్యవహరించారు. ఏ ఉద్యోగికైనా ప్రమోషన్ ఇస్తారు. ఇష్టానుసారంగా తీర్మానాలు చేసి రివర్స్ టెండరింగ్ తరహాలోనే ఒక మహిళా ఉద్యోగికి డిమోషన్ ఇచ్చారు. అంతే కాదు, ఒక ఉద్యోగి పది సంవత్సరాల పాటు సంఘంలో పని చేయకపోయినప్పటికీ ఆ కాలానికి లక్షలాది రూపాయల జీతాన్ని కూడా ఇచ్చేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నించారు.

మహిళా ఉద్యోగికి వేధింపులు

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక సహకార సంఘాల్లో త్రీమెన్ కమిటీలను నియమించారు. జిల్లాలోనే మంచి సహకార సంఘంలో పేరొందిన నాదెండ్ల సంఘంపై నాదెండ్ల గ్రామానికి చెందిన ఒక ప్రజా ప్రతినిధి, చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన ఒక వైసీపీ నేత దృష్టి పెట్టారు. ఈ సంఘంలో సీఈవోగా పని చేస్తున్న చేకూరి ధనలక్ష్మిపై వేధింపులు ప్రారంభించారు. సీనియర్ టీడీపీ నేత, జీడీసీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లుకు ఆమె దగ్గరి బంధువు. దీంతో ఆమెను సీఈవోగా తొలగిస్తూ తీర్మానం చేశారు. ఎప్పుడో 2010లో ఇక్కడ పనిచేస్తూ మానివేసిన కోడూరి ప్రసాదును సీఈవోగా నియమిస్తూ తీర్మానం చేయించారు. అంతేకాదు ప్రసాదు పది సంవత్సరాలుగా సంఘంలోనే పనిచేస్తున్నాడని, ఆ కాలానికి జీతం కూడా ఇవ్వాలని తీర్మానం చేశారు. ఏడాదికి సుమారు రూ.5 లక్షలు చొప్పున పది సంవత్సరాల కాలానికి సుమారు రూ.40 లక్షలు వరకు చెల్లించాలని ప్రయత్నించారు. ప్రసాదుకు ఆ కాలానికి జీతం ఇవ్వాలంటూ అప్పటి మంత్రి విడదల రజినీకి కూడా అప్పటి డీసీసీబీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ రాతంశెట్టి సీతారామాంజనేయులుకు సిఫార్సు లేఖ కూడా ఇచ్చారు. ఈ విషయాన్ని సహకార బ్యాంక్ వారు జిల్లా సహకార శాఖాధికారి దృష్టికి తీసుకువెళ్ళారు. సీఈవోగా ఉన్న చేకూరి ధనలక్ష్మిని తొలగించే అధికారం త్రీమెన్ కమిటీకి లేదని, ప్రసాదుకు జీతం కూడా ఇవ్వకూడదని బ్యాంక్ అధికారులకు డీసీవో ఆదేశాలు ఇచ్చారు. దీంతో అతన్ని తొలగిస్తూ మరలా తీర్మానం చేశారు. మళ్ళీ మరొకరిని సీఈవోగా నియమించుకొనేందుకు జిల్లాస్థాయి కమిటీ (డీఎల్ఈసీ) అనుమతి ఉండాలి. ఆ కమిటీలో జిల్లా చైర్మన్, సీఈవో, డీసీవో తదితరులు సభ్యులుగా ఉంటారు. ఐతే కమిటీ అనుమతి లేకుండానే మరొకరిని సీఈవోగా తీసుకున్నారు. అతనే ప్రస్తుతం సంఘంలో కొనసాగుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘించి రూ.7,87,620 నగదు డ్రా

నిబంధలకు విరుద్ధంగా నియమితులైన ప్రసాదు మాత్రం రెండుసార్లుగా రూ.7,87,620 జీతాన్ని డ్రా చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం సహకార కేంద్ర బ్యాంక్ వారు సంఘ సిబ్బందికి జీతాలు చెల్లించాలి. కాగా ఎరువుల వ్యాపారం కోసం గ్రామంలోని చైతన్య గ్రామీణ బ్యాంక్‌లో నాదెండ్ల సంఘం వారు ఖాతా తెరిచారు. దానిలో ఉన్న సొమ్మును ప్రసాదు అక్రమంగా డ్రా చేసుకున్నాడు. ఆ సమయంలో ఉన్న త్రీమెన్ కమిటీ చైర్మన్‌లు అతనికి సహకరించారు. నాదెండ్ల సంఘంలో సీఈవోగా పనిచేసిన ధనలక్ష్మికి 11 నెలల జీతం ఇప్పటికీ ఇవ్వలేదు. తనను అక్రమంగా తొలగించారని ధనలక్ష్మి హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలంటూ ఆమెపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చారు. అక్రమాలు బయటకు వస్తాయనే కారణంతో సీఈవో ఉద్యోగం నుంచి తొలగించి ఎట్టకేలకు క్లర్క్‌గా ఆమెను నియమించారు. ఐనప్పటికీ వైసీపీ నేతల వేధింపులు ఆగకపోవటంతో గణపవరం సహకార సంఘానికి క్లర్క్‌గా బదిలీ అయింది. ఆడిట్ అధికారులు కూడా ప్రసాదు అక్రమంగా జీతాన్ని డ్రా చేసుకున్నాడని నివేదికలో ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు. సహకార సంఘంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉంది.

మోడల్ స్కూల్ అధ్యాపకులకు 010 ద్వారా జీతాలు హర్షణీయం

గుంటూరు(విద్య), ఆగస్టు 4: మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న అధ్యాపకులకు ఆగస్టు నెల నుంచి 010 ద్వారా ప్రభుత్వం జీతాలు చెల్లించడం హర్షణీయమని ఏపీ మోడల్ స్కూల్స్ ఎస్‌టీఏ రాష్ట్ర కన్వీనర్ వల్లేపు శ్రీను పేర్కొన్నారు. దీని కోసం కృషి చేసిన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణను వికాస్‌నగర్‌లో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంతోకాలంగా అధ్యాపకులు జీతాల కోసం ఇబ్బందులు పడుతున్నారని, కొత్త ప్రభుత్వం అధ్యాపకుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి బి.హైమారావు, మోడల్ స్కూల్స్ నాయకులు ప్రభుదాస్, జి.హనుమంతరావు, సుబ్రహ్మణ్యం, అంకమ్మరావు, శౌరిరాజు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణను సత్కరిస్తున్న మోడల్ స్కూళ్ల అధ్యాపకులు

నిధులు కేటాయించి త్వరగా పనులు ప్రారంభించాలి

● నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, ఆగస్టు 4 : గుంటూరు ఛానెల్ పొడిగింపునకు ప్రభుత్వం నిధులు కేటాయించి, త్వరితగతిన పనులు ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు అన్నారు. స్థానిక సోమేశ్వరస్వామి కాలక్షేప మండపంలో ఆదివారం నల్లమడ రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమడ ఆధునీకరణకు గతంలో నిధులు కేటాయించారని, ఆ నిధులతోనే పనులు ప్రారంభించి వరద ముంపు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. నల్లమడ, ఓగేరు వాగులో కట్టలు బలహీన పడడమే కాకుండా జంగిల్ వల్ల నీరు ముందుకు కదలక కొద్దిపాటి వర్షాలకే వరద నీరు పొలాల్లో పడి ఉరకెత్తి రైతులు తీవ్ర నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర చట్టం కల్పించాలని డిమాండ్ చేశారు. గుంటూరు ఛానెల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు 113కోట్లు మంజూరు చేస్తే భూసేకరణ పూర్తవుతుందన్నారు. సాగునీటి సమస్య పరిష్కారం కోసం రైతులు గతంలో సీఎం జగన్‌ను కలిసేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డగించి అక్రమ కేసులు బనాయించారని, వాటిని వెంటనే ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, లావు అంకమ్మచౌదరి, ఈదర భ్రమరాంబ, కారుమంచి విజయకుమార్, మన్నవ హరిప్రసాద్, జనసేన మండల అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, నాయకులు మొవ్వా పెద్దన్న, కొల్లా నిర్మలా, రామన్, పానుబోతుల ప్రసాద్, పోతినేని వేణుగోపాలరావు, నాయుడు సుబ్బారావు, భీమినేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి : బొనిగల

గుంటూరు(విద్య), ఆగస్టు 4: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు బొనిగల హైమారావు తెలిపారు. లక్ష్మీపురంలోని ఎస్ఆర్ఎంవో స్కూల్లో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవోనం 84ను రద్దు చేసేలా ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్తామని చెప్పారు. సబ్జెక్టు టీచర్స్ కొరత లేకుండా చూడాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్య ఉన్న స్కూళ్లలో డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుల్ని నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌టీఏ జిల్లా కార్యదర్శి ఎన్వీ జగదీష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి అంతోనీబాబు, ఉపాధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వర్లు, వి.సతీష్‌కుమార్, కార్యదర్శులు కె.వేణుగోపాల్, హరగోపాల్, కె.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణునికి ప్రతి రూపమే అన్న ఎన్టీఆర్

● పశ్చిమ ఎమ్మెల్యే మాధవి



ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తోన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి, పక్కన మునగా సాంబశివరావు

గుంటూరు, ఆగస్టు 4 : తెలుగు వారి ఆరాధ్యదైవంగా ప్రతి ఇంట వివిధ రూపాల్లో ప్రతిబింబించే అన్న ఎన్టీఆర్ కారణజన్ముడని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ఆదివారం మారుతీనగర్ మెయిన్ రోడ్డు సెంటర్‌లో డ్రైవర్ రాముడు మునగా సాంబశివరావు శ్రీకృష్ణావతారంలో ఉన్న ఎన్టీఆర్ భారీ చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఆ చిత్రపటాన్ని ఎమ్మెల్యే మాధవి ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ కేవలం నటుడు, రాజకీయ నాయకుడు మాత్రమే కాదని దైవాంశ సంభూతుడని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగుప్రజలందరి గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని చిరస్మరణీయుడయ్యారన్నారు. ఎన్టీఆర్ వీరాభిమానిగా ఉంటూ చివరకు తన పేరు డ్రైవర్ రాముడుగా మార్చుకున్న సాంబశివరావు లాంటి వారెందరో నేటి తరానికి ఎన్టీఆర్ గొప్పతనాన్ని చాటిచెబుతున్నారంటూ అభినందించారు. టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు కె.కృష్ణ, పలువురు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవి నిర్ణయం యువతకు స్ఫూర్తిదాయకం

● ముస్లింసేన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని

గుంటూరు, ఆగస్టు 4 : ప్రజలకు సేవా కార్యక్రమాల కోసం తన నెల జీతం ఇచ్చేలా తీసుకున్న నిర్ణయం నేటి రాజకీయాల్లోకి వచ్చే యువతకు స్ఫూర్తిదాయకమని టీడీపీ నాయకుడు, ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని తెలిపారు. ఈ సందర్భంగా జీటీ రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో సుభాని ఎమ్మెల్యే మాధవిని ఆదివారం కలిసి పేద విద్యార్థులకు అందించేలా పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం సేన నాయకులు ఉన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పార్టీ నాయకులు తిరివీధి హరికృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆదివారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి చేతుల మీదుగా ప్రజలకు మొక్కలు అందజేశారు. కార్యాలయ ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో వనమా నరేంద్ర, ఆళ్ల హరి, రుద్ర సుభాని, అనాస్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రతి రక్తపు బొట్టు దేశం కోసమే : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మనం దానం చేసే ప్రతి రక్తపుబొట్టు దేశం కోసం ఉపయోగపడాలని మొహమ్మద్ నసీర్ అన్నారు. కంపానియన్ షిప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా నిర్వహించబోయే బ్లడ్ డొనేషన్ క్యాంప్ బ్రోచర్‌ను గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతో మందితో రక్తదానం చేయించి ఎంతోమందికి ప్రాణదానం చేశారన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులోని బీఆర్ స్టేడియం ఎదురుగా గల అంజుమన్ షాదీఖానాలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయబోతున్నారని అందులో ప్రతి ఒక్కరు భాగస్వాములై రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలు కాపాడి వాళ్ళ కుటుంబాల్లో వెలుగులు నింపడానికి దోహదపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు షబ్బీర్, సిరాజ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మునీర్, మన్సూర్, జాబీర్, షఫీ, ఇర్ఫాన్, అలీ, తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రతి ఒక్కరూ రేపటి కోసం ఒక్క అడుగు వేయాలి

ప్రతి ఒక్కరూ రేపటి కోసం - ఒక్క అడుగు వేయాలని ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. సాంబశివరావుపేటలోని సెయింట్ జోసెఫ్ ఉమెన్స్ కాలేజీలో నిర్వహించిన స్పందన ఈడా ఫౌండేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆత్మహత్యలు లేని సమాజం కోసం ఈషా ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వరూపారాణి, రోజ్ లీ, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సమూలేరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి శానిటేషన్ తనిఖీ చేసిన కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 4: నగరంలో అర్ధరాత్రి జరుగుతున్న శానిటేషన్ పనులను నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ సూర్యదేవర హరి కృష్ణ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని ప్రధాన రహదారులపై స్వీపింగ్ యంత్రాల ద్వారా జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. బస్టాండ్, జీటీ రోడ్డు, పెదకాకాని రోడ్డు, ఏటుకూరు రోడ్డు, నల్లపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో జరగాలన్నారు. ముఖ్యంగా డివైడర్ పక్కన శుభ్రం చేయాలని ఆదేశించారు. స్వీపింగ్ యంత్రాలకు జీపీఎస్ ఏర్పాటు చేసి ప్రతిరోజు నివేదిక అందజేయాలని అధికారుల ఆదేశించారు. రాత్రి సమయంలో వాహనాలు వేగంగా వస్తుంటాయని, వాటిపై పారిశుధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. ఎటువంటి ప్రమాదాల గురికాకుండా సేఫ్టీగా పారిశుధ్య పనులు నిర్వహించాలని ఆయన సూచించారు.

పావులూరికి మంత్రి పెమ్మసాని పరామర్శ



పెమ్మసానిని సత్కరిస్తున్న పావులూరి కృష్ణకుమార్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 4: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న పావులూరి కృష్ణకుమార్‌ను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పరామర్శించారు. త్వరగా అనారోగ్యం నుంచి కోలుకోవాలని ఆకాంక్షించారు. పెమ్మసానిని పావులూరి కృష్ణకుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు.

మెగా విరాళం

కేరళ సీఎం సహాయ నిధికి చిరంజీవి, రామ్‌చరణ్ రూ. కోటి, అల్లు అర్జున్ రూ. 25 లక్షలు





కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగి పడి నష్టపోయిన కుటుంబాలకు ఆసరా అందించేందుకు.. కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి ఇప్పటికే పలువురు సినీతారలు విరాళాలు అందించిన సంగతి తెలిసిందే. ఆదివారం మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్, అల్లుఅర్జున్ కూడా బాధితులు విరాళాలు ప్రకటించారు. చిరంజీవి, రామ్‌చరణ్ రూ.కోటి విరాళం అందించి, ఈ విపత్తులో నష్టపోయిన కుటుంబాలకు తమ వంతు సహాయాన్ని చాటారు. "ప్రకృతి విపత్తు వల్ల జరిగిన ఈ ప్రాణ నష్టాన్ని చూస్తుంటే నా గుండె బరువెక్కిపోతోంది. బాధితుల కుటుంబాలు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని చిరంజీవి ఎక్స్‌లో పేర్కొన్నారు. మరోవైపు, ఆదివారం ఉదయం అల్లు అర్జున్ కూడా రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. "కేరళలో జరిగిన ఈ సంఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. కేరళ ప్రజలు నాపై ఎంతో ప్రేమ చూపారు. వారి కోసం నా వంతుగా నేను ఈ సహాయం చేస్తున్నాను" అని అల్లు అర్జున్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సంయుక్త మీనన్ కేరళలో సహాయ కార్యక్రమాలు చేపడుతున్న విశ్వశాంతి ఫౌండేషన్‌కు విరాళం అందించినట్లు తెలిపారు. కానీ ఆమె ఎంత మొత్తం అందించారు అనేది గోప్యంగా ఉంచారు.

క్లైమాక్స్‌లో...



చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతోన్న సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతున్నట్లు యూనిట్ ఆదివారం ప్రకటించింది. 'సినిమా మొత్తం ఒకెత్తు, క్లైమాక్స్ ఒక్కటి మరో ఎత్తు అనేలా ఉండబో తోంది, భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్స్‌తో దర్శకుడు వశిష్ఠ క్లైమాక్స్ సీక్వెన్స్‌ను దృశ్యకావ్యంలా తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు. పతాక సన్నివేశాలకు ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ అనల్ అరసు నేతృత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 10న 'విశ్వంభర' ప్రేక్షకుల ముందు కొస్తోంది. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. త్రిష హీరోయిన్.

విజేతలు వీరే...

















దక్షిణాది తారలంతా తళుక్కున మెరిసిన '69వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. గెలుపు గుర్రాలకు పురస్కారాలను అందించారు. సిద్ధార్థ్ నటించిన తమిళ చిత్రం 'చిన్నా' అత్యధికంగా ఏడు అవార్డులు కొల్లగొట్టగా.. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తి సురేశ్ జంటగా తెరకెక్కిన 'దసరా' చిత్రం ఆరు విభాగాల్లో పురస్కారాలను కైవసం చేసుకుంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య నటించిన 'బేబీ'.. మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియన్ సెల్వన్ 2' ఐదు అవార్డులతో మూడో స్థానంలో నిలిచాయి. తమిళంలో ఉత్తమ నటుడిగా 'పొన్నియన్ సెల్వన్ 2' చిత్రానికి విక్రమ్.. 'మామన్నన్' (నాయకుడు) సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా 'పుష్ప' ఫేమ్ ఫహాద్ ఫాజిల్, ఉత్తమ నటిగా 'చిన్నా' చిత్రానికి నిమిషా సజయన్ ఎంపికయ్యారు. తెలుగువారిని విశేషంగా అలరించిన కన్నడ చిత్రం 'సప్త సాగరాలు దాటి' చిత్రానికి ఉత్తమ నటుడిగా రక్షిత్ శెట్టి, ఉత్తమ నటిగా రుక్మిణీ వసంత్ ఎంపికయ్యారు. మలయాళ నటుడు మమ్ముట్టి 'నన్‌పకల్ నేరతు మయక్కం' చిత్రానికి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అవార్డుల ప్రదానోత్సవంలో నాని మాట్లాడుతూ "కెరీర్ తొలినాళ్లలో అవార్డులు అందుకోవాలనే ఆసక్తి ఉండేది. ఇప్పుడు నేను నటించిన, నిర్మించిన సినిమాల్లోని నటీనటులు ఈ అవార్డులు అందుకుంటుంటే చూడాలని ఉంది. నాతో సినిమాలు తీసిన ఇద్దరు నూతన దర్శకులు అవార్డులు అందుకొన్నందుకు ఆనందంగా ఉంది" అని చెప్పారు. "ఓ అభిమాని చేసిన పనిని నేను ఇప్పటికీ మర్చిపోలేదు. ఓ అభిమాని.. ఓ రోజు హఠాత్తుగా పెళ్లి చేసుకుంటానని.. ఇంటి వాకిలి ముందు వాలిపోయాడు. ఆ సంఘటనతో ఒక్కసారిగా షాక్ అయ్యా" అని కీర్తి సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా, విశాఖ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

తెలుగు సినిమా విజేతల వివరాలు



ఉత్తమ చిత్రం - బలగం
ఉత్తమ దర్శకుడు - వేణు ఎల్దండి (బలగం)
ఉత్తమ పరిచయ దర్శకుడు - శ్రీకాంత్ ఓదెల (దసరా), శౌర్యువ్ (హాయ్ నాన్న)
ఉత్తమ దర్శకుడు(విమర్శకుల ఎంపిక) - సాయి రాజేశ్ (బేబీ)
ఉత్తమ నటుడు - నాని (దసరా)
ఉత్తమ నటుడు (విమర్శకుల ఎంపిక) - ప్రకాశ్ రాజ్(రంగ మార్తాండ), నవీన్ పొలిశెట్టి (మిస్ శెట్టి, మిస్టర్ పొలిశెట్టి)
ఉత్తమ నటి - కీర్తి సురేశ్,
ఉత్తమ నటి (విమర్శకుల ఎంపిక) - వైష్ణవి చైతన్య (బేబీ)
ఉత్తమ సహాయ నటుడు - బ్రహ్మానందం (రంగమార్తాండ), రవితేజ (వాల్తేరు వీరయ్య)
ఉత్తమ సహాయ నటి - రూపా లక్ష్మి (బలగం)
ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్ - బేబీ
ఉత్తమ గీత రచయిత - అనంత శ్రీరామ్ (బేబీ)
ఉత్తమ నేపథ్య గాయకుడు - శ్రీరామ చంద్ర (ఓ రెండు ప్రేమ మేఘాలిలా - బేబీ)
ఉత్తమ నేపథ్య గాయని - శ్వేతా మోహన్ (మాస్టారు మాస్టారు - సార్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ - సత్యన్ సూరన్ (దసరా).

క్రేజీగా రాంబో



షమ్ము హీరోగా హరీశ్ మధురెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'క్రేజీ రాంబో'. ర్యాప్‌రాక్ షకీల్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రారంభించి టైటిల్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో అశ్విన్‌బాబు మాట్లాడుతూ "టైటిల్ చాలా ఆసక్తికంగా ఉంది. సినిమా తప్పకుండా మంచి విజయం సాధించాలి" అని చెప్పారు. హీరో షమ్ము మాట్లాడుతూ "ఈ సినిమా కథ అద్భుతంగా ఉంటుంది" అని చెప్పారు. "చాలా మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని నిర్మాత ర్యాప్‌రాక్ షకీల్ అన్నారు.

స్కూల్ లైఫ్‌ను గుర్తుకు తెచ్చేలా



ప్రియదర్శి, విశ్వదేవ్, భాగ్యరాజ్, నివేత థామస్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నంద కిషోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'సయ్యారే సయ్యా' పాటను విడుదల చేశారు. అందరికీ స్కూల్ లైఫ్ జ్ఞాపకాలను, బాల్య స్నేహాలను గుర్తుకు తెచ్చేలా సాగిందీ పాట. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, కార్తీక్ ఆలపించారు. వివేక్ సాగర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: టి.సి.ప్రసన్న, డీఓపీ: నికేత్ బొమ్మ.



డబుల్... కిక్ ఇచ్చింది

'కమర్షియల్ సినిమా అంటే గుర్తుకొచ్చేది పూరి జగన్నాథ్. ఆయన ఇప్పటివరకూ చేసిన సినిమాల్లో ఎక్కువ సమయం, కష్టం పెట్టిన సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. స్క్రిప్ట్ విన్నప్పుడు ఎంత కిక్ వచ్చిందో, ఇస్మార్ట్ శంకర్ పాత్రలో నటిస్తున్నప్పుడూ అంతే కిక్ ఇచ్చింది. త్వరలో థియేటర్లలో కలుద్దాం' అని హీరో రామ్ పోతినేని అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని ఆదివారం వైజాగ్‌లో నిర్వహించారు. పూరి జగన్నాథ్ వీడియో సందేశంలో మాట్లాడుతూ 'వైజాగ్ గల్లీల్లో తిరిగినవాణ్ణి. నేను తీసిన గల్లీ సినిమా ఇది. సీ సెంటర్లలో విజిల్స్ వేస్తూ చూడండి' అని ప్రేక్షకులను కోరారు. థియేటర్‌కి పట్టిన తుప్పును వదలగొట్టే సినిమా ఇదని అలీ అన్నారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని హీరోయిన్ కావ్యథాపర్ చెప్పారు.

గొప్ప సినిమాగా నిలిచిపోతుంది



"తంగలాన్' వందేళ్ల క్రితం జరిగిన కథ. అందమైన సాహసోపేత ప్రయాణం ఈ సినిమా. మిమ్మల్ని ఆశ్చర్యంలో ముంచెత్తాలని ఈ సినిమా గురించిన ముఖ్యమైన విషయాలేవి బయటకు చెప్పలేదు. నా కెరీర్‌లో అత్యుత్తమ పాత్రను ఈ సినిమాలో చేశాను' అని హీరో విక్రమ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా పా రంజిత్ రూపొందించిన చిత్రమిది. ఈ నెల 15న విడుదలవుతోంది. చిత్రబృందం ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. పా రంజిత్ మాట్లాడుతూ 'మనదేశంలో అణచివేత, అసమానత్వం ఇంకా ఉన్నాయి. వీటిని ఎదుర్కొనేందుకు నేను సినిమాను మాధ్యమంగా ఎంచుకున్నాను. నా గత చిత్రాల్లానే 'తంగలాన్'ను కూడా తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. తంగలాన్ ప్రచార చిత్రాల్లో మా కష్టం కనపడుతోంది అని నిర్మాత జ్ఞానవేల్ రాజా అన్నారు.

సందేశాన్నిచ్చే 'సింబా'



జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. మురళీ మనోహర్ దర్శకత్వంలో సంపత్ నంది, దాసరి రాజేందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 9న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జగపతిబాబు మాట్లాడుతూ "ఇది ప్రకృతి మీద ఉన్న ప్రేమతో తీసిన సినిమా. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది" అని తెలిపారు. నిర్మాత సంపత్ నంది మాట్లాడుతూ "ఈ సినిమా వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇస్తుంది. ఇది సమాజం కోసం తీసిన సినిమా" అని అన్నారు. "సినిమా చాలా కొత్త పాయింట్‌తో ఉంటుంది. సంపత్ నంది అద్భుతమైన కథను ఇచ్చారు" అని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. "వనజీవి రామయ్య' జీవితం ఆధారంగా ఈ కథను రాసుకున్నారు సంపత్ నంది" అని నిర్మాత దాసరి రాజేందర్‌రెడ్డి అన్నారు.

లాడ్జీలో గుట్టుగా పేకాట శిబిరం

● పట్టణ పోలీసుల దాడి.. 14 మంది యువకుల అరెస్టు

మంగళగిరి సిటీ, ఆగస్టు 4: పట్టణ పరిధిలోని ఓ లాడ్జీలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళగిరి అర్బన్ పోలీసులు దాడి చేశారు. తెనాలి ఫ్లైఓవర్ పక్కన గల ఓ రెసిడెన్సీలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు పక్కా ప్రణాళికతో మెరుపు దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న 14 మంది యువకులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.లక్షా 73 వేల 560 నగదు, 14 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్టు పోలీసులు తెలిపారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

● నగదు, బైకు, సెల్‌ఫోన్లు స్వాధీనం ● ఏడుగురి అరెస్టు

మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో జూద స్థావరంపై మంగళగిరి రూరల్ పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడి చేశారు. ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, ప్రొబెషనరీ డీఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 1,510 నగదు, ఒక ద్విచక్ర వాహనం, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్టు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

మంగళగిరి, ఆగస్టు 4: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు సూచించారు. మంగళగిరి మండలపరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం రూరల్ పోలీసుస్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

ప్రత్తిపాడు, ఆగస్టు 4: మండల పరిధిలోని గనికపూడి గ్రామానికి చెందిన బాలిక అదృశ్యంపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పదో తరగతి పూర్తి చేసిన తరువాత ఇంటి వద్దనే ఉంటున్న బాలిక శనివారం తెల్లవారుజాము నుంచి కనిపించకుండా పోయింది. తమకు తెలిసిన చోట వెతికినా ఆచూకి తెలియకపోవడంతో బాలిక తండ్రి పోలీసులకు ఇచ్చిన పిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 నెలల బాబుతో కనిపించకుండా పోయిన తల్లి

ప్రత్తిపాడు, ఆగస్టు 4: భార్య భర్తల మధ్య గొడవలతో ఓ తల్లి తన 11 నెలల బిడ్డ సహా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలపరిధిలోని కోయవారిపాలెం గ్రామానికి చెందిన తడిపర్తి నాగరాజుకి మూడేళ్ల క్రితం గురజాల మండలం పల్లెగుంత గ్రామానికి చెందిన త్రివేణితో వివాహం జరిగింది. వారికి ఒక పాప, బాబు ఉన్నారు. అయితే కొన్ని రోజులుగా వేరు కాపురం విషయంలో భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం బాబుతో పాటు త్రివేణి ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త నాగరాజు ఇచ్చిన పిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై ప్రేమికుడి హత్యాయత్నం

తాడేపల్లి, ఆగస్టు 4: పెళ్లికి ఒప్పుకోలేదని ప్రియురాలిపై ప్రేమికుడు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తాడేపల్లి మండలం, వడ్డేశ్వరంలో ఆదివారం జరిగింది. కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన జి.కావ్య వడ్డేశ్వరంలో ఓ వసతి గృహంలో ఉంటూ మణిపాల్ వైద్యశాలలో నర్సుగా పని చేస్తోంది. ఈ క్రమంలో యువతి వసతి గృహం వద్దకు ఆమె ప్రేమికుడు క్రాంతి రాగా మాట మాట పెరిగి ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. క్రాంతి బ్లేడ్‌తో ఆమె గొంతు కోసేందుకు ప్రయత్నించాడు. కావ్య అప్రమత్తమవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఆమెను మణిపాల్ వైద్యశాలకు తరలించారు. స్థానికుల సహకారంతో క్రాంతిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

అనంతవరంలో కంటి వైద్య శిబిరం

తుళ్లూరు, ఆగస్టు 4: మండల పరిధిలోని అనంతవరంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామస్థుడు కట్లగుంట పిచ్చియ్య ఆధ్వర్యంలో ఎస్సీ కమ్యునిటీ హాలు వద్ద కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మందడం హసిని కంటి ఆస్పత్రి వైద్యులు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ చేశారు.

తుమ్మపూడిలో కొనసాగుతున్న వైద్యశిబిరాలు

● కొత్తగా ఐదు కేసుల నమోదు
● శిబిరాలు సందర్శించిన జిల్లా వైద్యాధికారి



తుమ్మపూడిలో వైద్యశిబిరానికి వచ్చిన జిల్లావైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి

దుగ్గిరాల, ఆగస్టు 4: మండలగ్రామం తుమ్మపూడిలో వైద్యశిబిరాలు 24 గంటలూ కొనసాగిస్తున్నామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. మూడ్రోజులుగా ప్రత్యేక వైద్యశిబిరాల ద్వారా వైద్య సేవలందిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో అదుపులోకి రాలేదు. శనివారం జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఇ.అన్నపూర్ణమ్మ శిబిరాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించిన విషయం విదితమే. ఆదివారం శిబిరానికి వచ్చిన డాక్టర్ విజయలక్ష్మి సిబ్బంది రాత్రింబవళ్లు మూడుషిఫ్టులలో పనిచేసి వైరల్ జ్వరాలను అదుపులోకి తీసుకురావాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ రాపిడ్ పరీక్షలు సైతం కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకూ 30 జ్వరాల కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇదివరలో జ్వరాలు వచ్చిన వారికి తగ్గుముఖం పట్టాయని సిబ్బంది తెలియజేశారు. పూర్తిస్థాయిలో మందులను సిద్ధం చేశామని డీఎంహెచ్‌వోకు వైద్యాధికారులు సిబ్బంది తెలియజేశారు. సర్పంచ్ అజీజున్, ఎంపీటీసీ వాసిరెడ్డి లక్ష్మిలు పరిస్థితిని డాక్టర్ విజయలక్ష్మికి వివరించారు. శిబిరం పూర్తిస్థాయిలో జ్వరాలు అదుపులోకి వచ్చే వరకూ కొనసాగించాలని కోరారు. తెనాలి సబ్‌యూనిట్ అధికారి వీ పున్నారెడ్డి, డాక్టర్ ఇజాజ్, రహమాన్, డాక్టర్ ఇందిర, ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ అమ్మవారి జయంత్యుత్సవం

● అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు



బోనాలు తలపై పెట్టుకుని వస్తున్న మహిళలు

మంగళగిరి సిటీ, ఆగస్టు 4: దేవాంగ చేనేత కుల దేవత అయిన శ్రీ రామలింగ చౌడేశ్వరీ అమ్మవారి జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కుప్పురావు కాలనీ 5వ లైనులోని అల్లక నమశ్శివాయ ఇంటి వద్ద నుంచి మహిళలు బోనాలను తలపై పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహించారు. పురవీధుల గుండా గండాలయ పేటలోని తోతాద్రి పోలేరమ్మ ఆలయం వరకు గ్రామోత్సవం సాగింది. అనంతరం చౌడేశ్వరీ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు, అర్చనలు జరిగాయి. కార్యక్రమాల్లో దేవాంగ సంక్షేమ సంఘం మంగళగిరి అధ్యక్ష, కార్యదర్శులు బల్లా వెంకటరమణ, అల్లక తాతారావు, నమశ్శివాయ, అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాడిశెట్టి శివశంకరరావు, గౌరవాధ్యక్షుడు మత్స నిరంజన్‌కుమార్, వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, గుత్తికొండ ధనుంజయరావు, జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, బీజేపీ నేత జగ్గారపు శ్రీనివాసరావు, దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమానికి మొదట సంఘీభావం తెలిపిన వ్యక్తి చంద్రబాబు

● నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఏసుపాదం



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెదనందిపాడు, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మొట్టమొదటి సారిగా సంఘీభావం తెలిపిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ తోడేటి ఏసుపాదం అన్నారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసుపాదం మాట్లాడుతూ ముప్పై ఏళ్ల పోరాటం మాదిగల కల నేటికి సాకారం అయ్యిందని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో వర్గీకరణ సాధించడంతో చరిత్రలో నిలిచిపోయారన్నారు. తొలుత వరగాని నుంచి డప్పు వాయిద్యాలతో నినాదాలు చేస్తూ విజయోత్సవ ర్యాలీ పెదనందిపాడు పాత బస్టాండ్ వరకు నిర్వహించి అనంతరం డప్పులు కొడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి, సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు కారుమూరి అంకయ్య, మహిళా అధ్యక్షురాలు కొండెపాటి సునీత, పల్లెపోగు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి : జొన్నా శివశంకర్



సమావేశంలో ప్రసంగిస్తున్న జొన్నా శివశంకర్

తాడేపల్లి, ఆగస్టు 4: కార్పొరేట్ కబంద హస్తాల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన జరిగే క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివశంకర్ మాట్లాడుతూ ఈ నెల 9న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో జరిగే క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఆగస్టు 9న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, గ్రామాల్లో క్విట్ కార్పొరేట్ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఎం శివసాంబిరెడ్డి కె.రామస్వామి, వేములపల్లి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఐ నేతలు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య తదితరులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 4: ఈ ఏడాది డిసెంబరు 26 నుంచి వచ్చే ఏడాది డిసెంబరు 26 వరకు ఒక సంవత్సరంపాటు భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పార్టీ జాతీయ సమితి పిలుపునిచ్చిందని ఈ నేపథ్యంలో పార్టీ ఉద్యమచరిత్రను వాడవాడలా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో తాడేపల్లి ప్రాంత కార్యకర్తల ముఖ్య సమావేశం తుడిమిల్ల అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ పేదవాడి భవిష్యత్తు కమ్యూనిస్టు పార్టీ చేతుల్లో ఉందని, ఏ ప్రజాసమస్య వచ్చినా సీపీఐ ముందుండి పోరాడుతుందన్నారు. అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన రూ.15వేల కోట్లను గ్రాంట్‌గా మార్చాలని, పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, తాడేపల్లి నాయకులు మానికొండ డాంగే, మునగాల రామారావు, దొంతా కోటేశ్వరరావు, కర్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామారావు

మంగళగిరి, ఆగస్టు 4: ప్రజాసమస్యలపై పోరాటాలను ఉధృతం చేయనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు చెప్పారు. మంగళ గిరి సీపీఎం కార్యాలయంలో ఆదివారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణా తరగతులు జరిగాయి. ఈ తరగతులకు పి.బాలకృష్ణ ప్రిన్సి పాల్‌గా వ్యవహరించారు. రామారావు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ఉందన్నారు. రాష్ట్రానికి బడ్జెట్ నిధులు గ్రాంట్‌గా ఇవ్వకుండా అప్పుగా ఇప్పిస్తామని చెప్పడం మోసం చేయడమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని ప్రశ్నించే స్థితిలో లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతుల్లో సీపీఎం నేతలు ఈమని అప్పారావు, ఎస్ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌లో హృదయార్చన కార్యక్రమం



హృదయార్చన కార్యక్రమంలో పాల్గొన్న వెంకటాచార్యులు తదితరులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 4: వేదవిశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు త్రిదండి చిన జీయర్ స్వామివారి మంగళశాసనాలతో ఆదివారం సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమంలో ఆశ్రమ ప్రతినిధులు పురాణం వెంకటాచార్యులు నిర్వహణలో సంగీత గురువులు శ్రీమాన్ దుర్గారావు, రూపకుమారి, తేజశ్వనిల ప్రత్యక్ష పర్యవేక్షణలో గ్రాటిట్యూడ్ ఆఫ్ ఆచార్య ఆధ్వర్యంలో భగవత్ రామానుజాచార్యుల వారిని స్తుతిస్తూ హృదయార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది పాల్గొని రామానుజులవారి సంకీర్తనలతో సనాతన ధర్మ ప్రచారాన్ని కొన సాగిస్తూ కీర్తనలు చేశారు. రామానుజాచార్యుల వారు చేసిన ఎన్నో సంఘ సంస్కరణలను కొనియాడుతూ యావత్తు ప్రపంచానికి వారిని గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ హృదయార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పురాణం వెంకటాచార్యులు తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



షరాఫ్ బజారులో నిర్మిస్తున్న కల్వర్టు

షరాఫ్ బజారులో కల్వర్టు నిర్మాణం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తెనాలి అర్బన్, ఆగస్టు 4: షరాఫ్ బజారులో కుంగిన కల్వర్టును తొలగించి కొత్త కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఈ నెల 14న షరాఫ్ బజారులో కుంగిన కల్వర్టు.. రాకపోకలకు ఇక్కట్లు శీర్షికతో కథనం వెలువడిన విషయం తెలిసిందే. స్పందించిన మున్సిపల్ అధికారులు ప్రధాన రహదారులను అనుసంధానం చేస్తూ కల్వర్టు నిర్మాణం చేపట్టారు. కల్వర్టు మంజూరు చేయడం పట్ల స్థానిక వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

● సరస్వతి విద్యా పీఠం ఉపాధ్యక్షుడు రాధాబాయి

తెనాలి అర్బన్, ఆగస్టు 4: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సరస్వతి విద్యా పీఠం ఉపాధ్యక్షుడు రాధాబాయి పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లోని సరస్వతి శిశుమందిర్ స్కూల్‌లో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలు సాధించాలన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. వనమా పూర్ణచంద్రరావు, డీఎల్ కాంతారావు, గడ్డిపాటి పుష్పకుమారి, ఎం.లక్ష్మీనారాయణ, హనుమంతరావు, మల్లిఖార్జునరావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్వాంసుడిని సన్మానిస్తున్న కళాకారులు

ముగిసిన పురాణ సభలు

తెనాలి అర్బన్, ఆగస్టు 4: రామలింగేశ్వరపేట చంద్రశేఖర గురుపాదుక పీఠంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పురాణ సభలు ఆదివారం ముగిశాయి. అన్నదాన సత్ర ప్రాంగణంలో నిర్వహించిన పురాణ సభలకు పలు ప్రాంతాల నుంచి విద్వాంసులు హాజరయ్యారు. విష్ణుభొట్ల అంజనేయచయనులు, యజ్ఞరామకృష్ణ, యజ్ఞనారాయణశర్మ సభలను నిర్వహించారు. అష్టదశ పురాణాలను చర్చించడంతో పాటు రామాయణ మహాభారత, భాగవత అంశాలపై విద్వాంసులు ప్రసంగించారు. ప్రతిఏటా ఈ సభలను నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని నిర్వాహకులు చెప్పారు.



డిపాజిటర్లను సన్మానిస్తున్న చైర్మన్

లాభాల బాటలో సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ

తెనాలి అర్బన్, ఆగస్టు 4: ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లాభాల బాటలో నడుస్తుందని చైర్మన్ పీఎస్ రాజు చెప్పారు. ఎన్జీవో కల్యాణ మండపంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపకుడు వాసిరెడ్డి హనుమంతరావు చిత్రపటానికి నివాళులర్పించారు. మేనేజింగ్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, దేశంలోని 10 టాప్ సొసైటీలలో ముందున్నామని ఈ ఏడాది రూ.77 కోట్ల లాభాలను గడించామని చెప్పారు. డిపాజిట్లపై 10శాతం, పొదుపు ఖాతాలపై 6.5శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. డిపాజిటర్లను సన్మానించారు. ఆరెం శంకరరావు, మేనేజర్ శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కథల పుస్తకాలు అందజేస్తున్న ఉమామహేశ్వరరావు

గ్రంథాలయాలకు కథల పుస్తకాల వితరణ

తెనాలి అర్బన్, ఆగస్టు 4: పట్టణంలోని మహిళా బాలల గ్రంథాలయం, నెహ్రూ రోడ్డులోని గ్రంథాలయానికి కథల పుస్తకాలను వితరణగా అందించారు. వేజండ్ల వెంకటసుబ్బారావు ట్రస్ట్ నిర్వాహకులు వేజండ్ల ఉమామహేశ్వరరావు ఆదివారం ఈ పుస్తకాలు అందజేశారు. పుస్తక పఠన అవశ్యకతను గుర్తించేందుకు తద్వారా విలువలతో కూడిన జీవితాన్ని గడిపేందుకు గ్రంథాలు దోహదపడతాయన్నారు. ఆధునిక ప్రపంచంలో గ్రంథాలయానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని, జీవితాన్ని మలుపుతిప్పే జ్ఞానం ఇక్కడే దొరుకుతుందన్నారు. వేజండ్ల నవ్య, రమాదేవి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



ఆహారం పంపిణీ చేస్తున్న ఎస్వీ యోగా సభ్యులు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 4: పట్టణంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీవెంకటేశ్వర యోగ సేవ కేంద్రం సభ్యులు నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఆదివారు ఎస్వీ యోగా సభ్యుడు చదలవాడ సతీష్‌చంద్ర మూడో వర్ధంతి సందర్భంగా తల్లి, తండ్రి నయనతార, వేణుగోపాలరావు, కుటుంబ సభ్యులు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య ఉమామహేశ్వరావు, దామోదర్, ప్రణవ్, అద్విక్, కుర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇస్లాం ధార్మిక తబ్లిక్ జమత్‌కు ప్రభుత్వం సహకరిస్తుంది

● ముస్లిం మత పెద్దలతో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



ముస్లిం మైనార్టీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, ఆగస్టు 4: ఇస్లాం ధార్మిక తబ్లిక్ జమత్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం నంబూరు గ్రామం డాంగేనగర్ వెనుక పక్కన ముస్లింలు జనవరి-2025లో రెండు రోజులు పాటు జరిగే ఇస్లాం ధార్మిక తబ్లిక్ జమాత్ గుంటూరు జిల్లా బహిరంగ ఇస్తిమా కార్యక్రమం గురించి జరిగిన ముస్లిమ్స్ మత మతపెద్దలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ మైనార్టీలు అంటే తెలుగుదేశం పార్టీకి ఎంతో ఇష్టమన్నారు. ముస్లింల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రతి ఏడాది జరిగే ఇటువంటి పండగలకు తాను ముందుండి నడిపిస్తానని తెలిపారు. మైనార్టీలు ఒకటి తెలుగుదేశం మరొకటి కాదని అంతే ఒకే కుటుంబం, ఒకే మాటని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ మోసిన్, దండి బాబు, మాజీ ఎంపీటీసీ అల్లావుద్దీన్, మురళీకృష్ణ, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని మండల అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు

● మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు



ప్రసంగిస్తున్న మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు

పెదకాకాని, ఆగస్టు 4: పెదకాకాని మండల అభివృద్ధికి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని, మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షులు కామినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి కామినేని శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఎంపీటీసీల వారీగా అభివృద్ధి పనులకు సంబంధించి అర్జీలు తీసుకున్నామన్నారు. వారిచ్చిన అభివృద్ధి పనులను ఆమోదింపజేసి, త్వరలో టెండర్లు పిలుస్తామని తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో మండల పరిషత్ నిధులను వినియోగించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎంపీడీవో నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎంపీటీసీల వారీగా ఆయా గ్రామాల్లో కావలసిన అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలు తీసుకున్నామన్నారు. అన్నింటికి నిధులు కేటాయించి త్వరలో పనులు ప్రారంభమయ్యేలాగా చూస్తామన్నారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొరికిన హ్యాండ్‌బ్యాగ్‌ను పోలీసులకు అప్పగించిన బాలుడు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 4: తనకు దొరికిన హ్యాండ్‌బ్యాగ్‌ను పోలీసులకు బాలుడు అప్పగించిన సంఘటన తెనాలిలో జరిగింది. త్రీటౌన్ సీఐ రమేష్ బాబు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం ఎన్నారై స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న ఓం సాయిరాం ఆమరావతి ప్లాట్స్‌లోని ఇంటికి వెళుతున్న సమయంలో రోడ్డుపై మహిళ హ్యాండ్‌బ్యాగ్‌ను చూశాడు. ఆ బ్యాగ్‌ను తెరచి చూడగా సెల్‌ఫోను, వివిధ బ్యాంకుల మూడు ఏటీఎంలు, రెండు వేల నగదు ఉన్నాయి.



ఓంసాయిరాంను అభినందిస్తున్న సీఐ రమేష్‌బాబు తదితరులు

అభినందించిన పోలీసులు

ఓం సాయిరాం వెంటనే త్రీటౌన్ పోలీసులకు ఆ హ్యాండ్‌బ్యాగ్‌ను అందచేశాడని తెలిపారు. బ్యాగ్ పోగొట్టుకున్న మహిళకు సమాచారమిచ్చి, ఆ బ్యాగ్‌ను అందజేశామన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని ఈ సందర్భంగా పోలీసులు కోరారు. హ్యాండ్‌బ్యాగును నిజాతీగా అప్పగించిన బాలుడు ఓం సాయిరాంను సీఐ రమేష్‌బాబు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

దౌర్జన్యంపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 4: టాస్క్ ఫోర్స్ సిబ్బంది మహిళా ఏఎస్ఐపై దౌర్జన్యం చేసి, చేతిని గాయపర్చిన వారిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్‌పోలీసులు తెలిపారు. ఆదివారం త్రీటౌన్ పోలీసులు తెలపిన వివరముల ప్రకారం శనివారం సుల్తానాబాదులో నేషనల్ చైల్డ్ రైట్స్ కమిషన్ వారి ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తు అందులో భాగంగా సుల్తానాబాదులో మా కార్ వాష్ షాపులో బాల కార్మికులను గుర్తించి వారిని రక్షించబోగా షాపు యాజమాన్యాం అడ్డుపడి తమపై దౌర్జన్యం చేశారని, విధులకు ఆటకం కల్పించారని మహిళ ఏఎస్ఐ బేబీరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

మినీ కవితల పోటీ విజేతలు

గుంటూరు, ఆగస్టు 4 : అమరావతి సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో ఫేస్ బుక్ గ్రూపులో డాక్టర్ రావి రంగారావు నిర్వహిస్తున్న వారం వారం కవితల పోటీల విజేతలను ఆదివారం ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ వారం మినీ కవితల పోటీకి ఇచ్చిన 'అందం' అంశంపై మొత్తం 44 మంది కవులు మినీ కవితలు పంపించారు. ఇందులో 12 మంది కవుల మినీ కవితలు ప్రశంసా పత్రాలు పొందినట్లు తెలిపారు. వురిమళ్ళ సునంద (అమెరికా), మేడిశెట్టి యోగేశ్వరరావు (అమెరికా), టి.ధనుంజయరెడ్డి (గుంటూరు), లీలాకృష్ణ (తెనాలి), ఎనికేపల్లి శివకుమార్ (నందిగామ), ఎస్.రవికుమార్ (గుంటూరు), పొత్తూరి రామకృష్ణ (విజయవాడ), ఆళ్ల నాగేశ్వరరావు (తెనాలి), సింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు), పాణిరావు యర్రగుంట్ల (గుంటూరు), డాక్టర్ డివిజి శంకరరావు (విజయనగరం), చిత్తలూరి (హైదరాబాద్) విజేతలకు అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు తెలిపారు.

యువతిపై ప్రేమికుడి హత్యాయత్నం

తాడేపల్లి, ఆగస్టు 4: పెళ్లికి ఒప్పుకోలేదని ప్రియురాలిపై ప్రేమికుడు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తాడేపల్లి మండలం, వడ్డేశ్వరంలో ఆదివారం జరిగింది. కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన జి.కావ్య వడ్డేశ్వరంలో ఓ వసతి గృహంలో ఉంటూ మణిపాల్ వైద్యశాలలో నర్సుగా పని చేస్తోంది. ఈ క్రమంలో యువతి వసతి గృహం వద్దకు ఆమె ప్రేమికుడు క్రాంతి రాగా మాటమాట పెరిగి ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. క్రాంతి బ్లేడ్‌తో ఆమె గొంతు కోసేందుకు ప్రయత్నించాడు. కావ్య అప్రమత్తమవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఆమెను మణిపాల్ వైద్యశాలకు తరలించారు. స్థానికుల సహకారంతో క్రాంతిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

6న జరిగే మృతవీరుల సభను జయప్రదం చేయండి

● ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్

తెనాలి రూరల్, ఆగస్టు 4: ఈ నెల 6న జరిగే చుండూరు మృతవీరుల సంస్మరణ సభకు అంబేద్కర్ వాదులు, ప్రజాసంఘాల వారు పెద్ద సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఐక్యవేదిక కార్యలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అనిల్, ఉన్నవ సాల్మాన్, రవిచంద్ర, కనపత్రి శశి, దండమూడి సతీష్, సునీల్, వంశీ, కుర్రా జశ్వంత్‌కృష్ణ, దుబాయ్‌బాబు, సయ్యద్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 4012 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 4: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వ కు 4012 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 10.7 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 166 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 707 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 556 క్యూసెక్కుల నీరు, పశ్చిమ కాల్వకు 210 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 380 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 1179 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అలరించిన ఘంటసాల భక్తి గాన నీరాజనం



గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 4: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం పీఎల్ఎన్ మూర్తి నిర్వహణలో నవ కళోదయ ఆర్ట్స్ గుంటూరు వారిచే ఘంటసాల భక్తి గాన నీరాజనం కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సంస్థ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ గాయకులు టి.సుధీర్, ఆర్‌పీఎల్ నరసింహరావు, అన్నపూర్ణ, నారాయణ, మోహన్, అశోక్, వెంకాయమ్మచే పలు ఘంటసాల గీతాలను శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమం అనంతరం కళా కారులకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రక్షాళన ఎప్పటికో?

- జవహర్ విజ్ఞాన కేంద్రం, లాంగ్వేజ్ ల్యాబ్ నిర్వీర్యం
- గడపతొక్కని కార్పొరేట్ కంపెనీలు.. జాడలేని జాబ్‌మేళాలు
- ఎన్డీఏ ప్రభుత్వమైనా కళాశాలను గాడిలో పెడుతుందా?

గుంటూరు(విద్య), ఆగస్టు 4: ఒకప్పుడు అక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు ఇన్ఫోసిస్, ఐఎల్ఎం(ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజమెంట్), టీసీఎస్ వంటి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించేవారు. స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా, నాక్ గుర్తింపు ఉన్న ఆ కళాశాల విద్యార్థినుల జీవితాలకు దిక్సూచిగా మారి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా కల్పించేవారు. అయితే గడిచిన ఐదేళ్లలో ఈ కళాశాల కీర్తిని ఇక్కడ నిర్వహకులు మసకబారేలా చేశారు. యూజీసీ నుంచి పుష్కలం గా నిధులు వస్తున్నా వాటిని సద్వినియోగం చేసుకునేలా కార్యచరణ మాత్రం లేకుండా పోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. డిగ్రీ పూర్తిచేసిన వారికి పట్టాలు చేతికిచ్చి పంపడం మినహా వారికి ఉద్యోగ, ఉపాధి కల్పించేదిశగా చర్యలు తీసుకున్న దాఖలు లేవు. ఇదీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రస్తుత దుస్థితి. కళాశాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తే తప్ప తిరిగి పూర్వవైభవం రాదని విద్యార్థినులు అంటున్నారు.



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల



ఉండీ ఉపయోగం లేని లాంగ్వేజ్ ల్యాబ్

జేకేసీ, లాంగ్వేజ్ ల్యాబ్‌లు నిర్వీర్యం..

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 1500 మందికిపైగా విద్యార్థినులు బీఎస్సీ, బీఏ, బీకాంతోపాటు కొన్ని పీజీ కోర్సులు అభ్యసిస్తున్నారు. డిగ్రీ విద్యార్థినులకు మూడో ఏడాది నుంచే ఉద్యోగ ఉపాధి అకాశాలకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ఉన్నత విద్యామండలి ప్రత్యేకంగా ఇక్కడ జవహర్ విజ్ఞాన కేంద్రం, లాంగ్వేజ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకు అప్పట్లోనే దాదాపు రూ.15లక్షలకు పైగా వెచ్చించారు. రెండు ల్యాబ్‌ల్లో దాదాపు 60పైగా అత్యాధునిక కంప్యూటర్స్‌తో పాటు ప్రత్యేకంగా శిక్షణ పొందిన మెంటార్స్, కోఆర్డినేటర్స్‌ను నియమించారు. కార్పొరేట్ కంపెనీలతో నిత్యం అనుసంధానమౌతూ వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి క్యాంపస్ ఇంటర్వ్యూల కోసం విద్యార్థుల్ని సన్నద్ధం చేసేవారు. అయితే గడిచిన నాలుగున్నర ఏళ్లలో ఇటువంటి కార్యకలాపాలు దాదాపు స్వస్తిచెప్పి శిక్షణకు అటకెక్కించారు.

యాచకుడి మృతి

తెనాలి, మారీసుపేట ఆగస్టు 4: పట్టణంలో యాచకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఆదివారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి చెంచుపేట ఓవర్ బ్రిడ్జిపై వృద్ధుడు యాచిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. స్థానికులు ఉదయం వృద్ధుడు మరణించి ఉండటాన్ని గమనించి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారమిచ్చారని తెలిపారు. హెల్పింగ్ హాండ్స్ సోల్జర్స్ సంస్థ సభ్యులకు మృతదేహన్ని ఖననం చేసేందుకు సమాచారం ఇవ్వగా వారు వృద్ధుని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.



కొబ్బరి కాయల వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

ఖాళీ కొబ్బరి బోండాలు వీధుల్లో వేయవద్దు

పొన్నూరు టౌన్, ఆగస్టు 4: ఖాళీ కొబ్బరి బొండాలను వీధులలో ఎక్కడపడితే అక్కడ పడవేయవద్దని మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని రహదారులపై కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ వర్షకాలంలో ఖాళీ కొబ్బరిబొండాలలో వర్షపు నీరు నిల్వవుండి దోమల ఉత్పత్తికి కారణం అవుతాయన్నారు. దోమల నివారణ చర్యలో భాగంగా ఖాళీ కొబ్బరి బొండాలను ఎక్కడపడితే అక్కడ నిల్వ చేయవద్దని ఆదేశించారు. ఖాళీ కొబ్బరి బొండాలను రెండుగా వేరుచేసి గోతాలో నిల్వ చేసి కంపోస్ట్ యార్డులో మాత్రమే పడవేయాలని సూచించారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో శానటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాహు కేతు గ్రహలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాహు, కేతు పూజలకు పోటెత్తిన భక్తులు

పెదకాకాని, ఆగస్టు 4: ఆషాఢ అమావాస్య ఆదివారం సందర్భంగా పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన రాహు, కేతు పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం రాహుకాల సమయం గం.4:30 వరకు 2140 టికెట్లు భక్తులకు విక్రయించినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. రాహు కేతు పూజల ద్వారా ఆదివారం రూ.10,70,000లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాహుకేతు పూజలు ఇతర సేవలు కలిపి రూ.12,75,000లు ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేబ్రోలు ఎంపీపీ సాహితి

గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి: ఎంపీపీ

పొన్నూరు టౌన్, చేబ్రోలు, ఆగస్టు 4: గ్రామాలాభివృద్ధికి సమష్టిగా పాటుపడదామని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. స్థానిక పొన్నూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ పద్మలీల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు ప్రభుత్వ శాఖల పనితీరు, అభివృద్ధి పనుల గురించి సమీక్ష జరిపారు. ప్రధానంగా గ్రామాల్లో వర్షాల ప్రభావం అధికంగా ఉన్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, తాగునీటి క్లోరినేషన్, పారిశుధ్య సమస్యలపై చర్చించారు. ఇటీవల జరిగిన గ్రామ సభలో వచ్చిన అర్జీల గురించి సమీక్ష జరిపారు. సమావేశంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో....

చేబ్రోలు మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొక్కిలిగడ్డ సాహితి అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుధ్య సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జ్యోతి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన ఫ్రెండ్లీ వాకర్స్ సభ్యులు

షుగర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

● ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్

పొన్నూరు టౌన్, ఆగస్టు 4: షుగర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. పట్టణంలోని డీవీసీ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు ఫ్రెండ్లీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. 150మందికి షుగర్ వ్యాధి పరీక్షలు నిర్వహించి శిబిరంలో ఉచితంగా క్లబ్ ద్వారా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జమైతే ఉల్మా నిర్వాహకులు అబ్దుల్లా బేగ్, పట్టణ అభివృద్ధి కన్వీనర్ షేక్ యాసిన్ బాబా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో జూద స్థావరంపై మంగళగిరి రూరల్ పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడిచేశారు. ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, ప్రొబెషనరీ డీఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,510 నగదు, ఒక ద్విచక్ర వాహనం, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరు పరచనున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.